



ఉసురు తీస్తున్న ఆన్‌లైన్ బెట్టింగులు

- అందుబాటులో 23 యాప్‌లు
- పల్లెలకూ పాకిన బెట్టింగ్ జాడ్యం
- క్రికెట్, ఫుట్‌బాల్, జూదం దేన్నీ వదలని.. బెట్టింగ్‌రాయుళ్లు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): ఎటువంటి కష్టం లేకుండా.. చెమట చుక్క కారకుండా.. ఒంటిమీద షర్టు నలగకుండా.. అతి సులువుగా సంపాదించాలి.. రాత్రికి రాత్రే.. కోటీశ్వరులు కావాలి.. ఈ అత్యాశే ఎందరినో.. ఆన్‌లైన్ బెట్టింగుల వైపు నడిపిస్తోంది. క్రికెట్, ఫుట్‌బాల్, జూదం దేన్నీ వదలకుండా బెట్టింగ్ పెట్టి పలువురు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్ ఉండడంతో.. కావాల్సిన ఆటలపై ఆన్‌లైన్‌లో అతిసులువుగా బెట్టింగులకు పాల్పడుతున్నారు. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లెక్కకు మించి బెట్టింగు యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లలో క్రికెట్, ఫుట్‌బాల్, జూదం తదితరవి ఆడుతున్నారు. తమ చేతిలోని ఆండ్రాయిడ్‌తోనే బెట్టింగులకు పాల్పడే అవకాశం ఉండడంతో.. మూడో కంటికి తెలియడం లేదు. ఒకప్పుడు పట్టణాలకు మాత్రమే పరిమితమైన ఈ బెట్టింగ్ ఇప్పుడు పల్లెలకూ పాకింది. గతంలో బెట్టింగ్ ఎక్కువగా యువకులు ఆడే వాళ్లు. ఇప్పుడు వయస్సుతో సంబంధం లేకుండా అందరూ ఆడుతున్నారు. ఈ బెట్టింగ్ మాయలో పడి.. ఎందరో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. బయట పడలేక.. అప్పులు తీర్చే మార్గం కనిపించక.. ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. కుటుంబ సభ్యులు ఆర్థిక సమస్యల్లో కూరుకుపోతున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో ఇటువంటి సంఘటనలు కొన్ని చోటుచేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

విషాదాన్ని నింపిన క్రికెట్ బెట్టింగ్..

ప్రేమించి పెళ్లి చేసుకుని.. ఒక కుమారుడితో సంతోషంగా ఉన్న కుటుంబాన్ని క్రికెట్ బెట్టింగ్ విడదీసింది. అప్పులు ఎక్కువ కావడం.. భర్త వేధింపులతో భార్య ఆత్మహత్యకు పాల్పడింది. ఈ కేసులో జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చిన భర్త సైతం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ప్రస్తుతం వాళ్ల కుమారుడు అవ్వాతాతల దగ్గర ఉంటున్నాడు. విషాదకర ఈ సంఘటన వివరాల్లోకి వెళ్తే.. సుమారు మూడు సంవత్సరాల కిందట.. పుల్లంపేట మండలంలోని ఓ గ్రామంలో.. చేనేత పనిచేసే యువకుడు.. తమ సామాజిక వర్గానికే చెందిన యువతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఒక మగబిడ్డ సంతానం. అనంతరం ఆ యువకుడు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటు పడ్డాడు. దీంతో పనిమానేసి.. అందినచోటల్లా అప్పులు చేశాడు. బెట్టింగ్‌లో పోగొట్టుకున్నాడు. చివరకు భార్య, తల్లిదండ్రుల వద్ద నుంచి కూడా లక్షల్లో అప్పులు తెప్పించి.. బెట్టింగ్ ఆడాడు. అప్పుల వాళ్లు నిలదీయడంతో భార్య నగలు తాకట్టు పెట్టాడు. అప్పులు ఎక్కువ కావడంతో భార్యభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చాయి. భార్యను కొట్టి వేధించేవాడు. దీంతో ఓ రోజు భార్య ఉరి వేసుకుంది. ఆమె తల్లిదండ్రులు కేసు పెట్టడంతో.. అతను జైలుకు వెళ్లాడు. రెండు నెలలు జైలులో ఉండి. బెయిల్‌పై వచ్చాడు. మనస్తాపంతో.. ఓ రోజు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. బెట్టింగ్ వల్ల భార్య, భర్తలు ఆత్మహత్య చేసుకోగా.. వాళ్ల బిడ్డ.. ప్రస్తుతం అవ్వతాతల దగ్గర పెరుగుతున్నాడు. కాగా బిడ్డకు ప్రభుత్వం ఏదైనా సాయం చేయాలని కోరుతున్నారు. బెట్టింగ్‌తో బంగారం లాంటి కుటుంబం నాశనమైందని స్థానికులు పేర్కొంటున్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ బలి

బి.కొత్తకోట దెయ్యాలవారిపల్లెకు చెందిన శ్రమణ్‌కుమార్‌రెడ్డి (24) హైదరాబాదులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. క్రికెట్ బెట్టింగులకు అలవాటు పడిన అతను ఇటీవల జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లకు భారీగా బెట్టింగులు కాసినట్లు సమాచారం. దీంతో స్నేహితులు, తెలిసిన వారి వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేసినట్లు తెలిసింది. అప్పులోళ్ల ఒత్తిళ్లు ఎక్కువ కావడంతో.. బుధవారం రాత్రి హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి వచ్చాడు. ఇంటికి కూడా వెళ్లకుండా ఆకులవారిపల్లె సమీపంలోని ఓ ఆలయంలోకి వెళ్లి ఇనుప గ్రిల్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

చిరువ్యాపారి మృతి



మృతుడు కార్తీక్ (ఫైల్)

రైల్వేకోడూరు పట్టణం పాతబజారు ప్రాంతంలో నివసించే కార్తీక్.. పట్టణంలో ఫోటోఫ్రేమ్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఇతను ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడేవాడు. భారీస్థాయిలో డబ్బు పోయి అప్పుల పాలయ్యాడు. అతని తల్లిదండ్రులు కొంత మేర అప్పులు చెల్లించారు. మిగిలిన వాళ్లు కూడా ఒత్తిళ్లు తేవడంతో.. ఈ ఏడాది ఆగస్టులో మండల పరిధిలోని రైల్వేట్రాక్ వద్ద ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నాడు. ఇటువంటి సంఘటనల్లో బెట్టింగులు ఆడి అప్పులు చేసి.. వాళ్లు చనిపోతే.. అతని మీద ఆధార పడిన కుటుంబాలు రోడ్డున పడడం విషాదం.

లెక్కకు మించి ఆన్‌లైన్ యాప్‌లు

గతంలో క్రికెట్ బెట్టింగ్.. బుకీలు నిర్వహించే వాళ్లు. దీంతో అందరూ ఆడడానికి సాధ్యం అయ్యేది కాదు. బ్రోకర్లు, ఏజెంట్లు, బుకీలపైన పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేసి జైలుకు పంపేవాళ్లు. దీంతో ఎంతో కొంత బెట్టింగ్ ఆడడానికి భయపడేవాళ్లు.. రహస్యంగా ఆడడానికి ప్రయత్నించే వాళ్లు. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్‌లో లెక్కకు మించి బెట్టింగ్ యాప్‌లు అందుబాటులోకి వచ్చాయి. కేవలం ఆండ్రాయిడ్ ఫోన్ చేతిలో ఉంటే చాలు బెట్టింగ్ ఆడవచ్చు. దీంతో ఆన్‌లైన్ బెట్టింగ్ ఆడుతున్న విషయం మూడోకంటికి కూడా తెలియడం లేదు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌ను పోలీసులు నిరోధించలేకున్నారు. చిన్నా.. పెద్ద, అనే వయస్సు తేడా లేకుండా.. ఆన్‌లైన్ బెట్టింగులు ఆడి.. లక్షలాది రూపాయల అప్పుల్లో చిక్కి.. బయటకు వచ్చే దారి లేక బలవతంగా తనువు చాలిస్తున్నారు. కేంద్రప్రభుత్వం సైతం తమకు జీఎస్టీ (ఆదాయం) వస్తోంది చాలు అనే ధోరణిలో ఉండడంతో.. ఆన్‌లైన్ బెట్టింగ్‌లో ఎటువంటి నిషేధం ఉండడం లేదు. దీంతో ఆన్‌లైన్ యాప్‌లలో విచ్చలవిడిగా బెట్టింగ్ జరుగుతోంది. ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ వల్ల ఎందరో ప్రజల ప్రాణాల బలవుతున్నాయి. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం ఈ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను నిషేధించాలని పలువురు బాధితులు కోరుతున్నారు.



నేడు జాతీయ లోక్ అదాలత్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22 బెంచ్‌లు ఏర్పాటు
- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప(రూరల్) జూన్ 28: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు శనివారం ఉదయం 10 గంటలకు ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తం గా జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన జడ్జి జి.శ్రీదేవి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ వివరాలను శుక్రవారం జడ్జి మీడియాకు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 22 బెంచ్‌లు ఏర్పాటుచేశామన్నారు. కడపలోని జిల్లా కోర్టు ఆవరణలో 6, ప్రొద్దుటూరు కోర్టులో 4, రాయచోటి కోర్టులో 4, బద్వేల్ కోర్టులో 2, రాజంపేట కోర్టులో 1, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, లక్కిరెడ్డిపల్లె, మైదుకూరు కోర్టులలో ఒక్కొక్క బెంచ్ చొప్పున ఏర్పాటుచేశామన్నారు. అలాగే రాజంపేటలోని మూడవ అదనపు జిల్లా కోర్టుకు సంబంధించిన కేసులు కడప అదనపు జిల్లాకోర్టు (ఫ్యామిలీకోర్టు) బెంచ్‌లో పరిష్కస్తామన్నారు. రైల్వేకోడూరు కోర్టుకు సంబంధించిన కేసులు కడప ఎక్సైజ్ కోర్టు బెంచ్‌లో, రాజంపేట మెజిస్ట్రేట్ కోర్టుకు సంబంధించిన కేసులు, నందలూరు కోర్టుకు సంబంధించిన కేసులు కడప ఫస్ట్ అడిషనల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నా రు. సిద్ధవటం కోర్టుకు సంబంధించిన కేసులు బద్వేల్ జుడీషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్ కోర్టు బెంచ్‌లో పరిష్కరిస్తారన్నారు. ఈ మార్పును కక్షిదారులు, న్యాయవాదులు, ఆయాశాఖ అధికారులు గమనించాలన్నారు.

ట్రిపుల్ ఐటీ అడ్మిషన్లకు 53,863 దరఖాస్తులు

నూజివీడుటౌన్, జూన్ 28: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యలో ప్రవేశాలకు అధికభాగం బాలికల నుంచి దరఖాస్తులు అందాయని, ఆర్జీయూకేటీ అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు ఆర్కేవ్యాలీ, శ్రీకాకుళం, ఒంగోలు క్యాంపస్‌లలో ఉన్న 4,400 సీట్లకు మొత్తం 53,863మంది విద్యార్థులు దరఖాస్తు చేశారన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి 34,154 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 19,671 మంది, ఇతర రాష్ట్రాల నుంచి 38 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 30,857 మంది బాలికలు ఉండగా, 23,006 మంది బాలురు ఉన్నారన్నారు. ఇక సైనిక సంతతి విభా గంలో 2,582 మంది, ఎన్‌సీసీలో 1830, స్పోర్ట్స్ విభాగంలో 1162, దివ్యాంగుల విభాగంలో 332, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 270 మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ప్రస్తుతం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

ఒకటి నుంచి అడ్మిషన్ల ప్రక్రియ

జూలై 1వ తేదీ నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. సైనిక సంతతికి చెందిన విద్యార్థులకు జూలై 1 నుంచి 3వ తేదీ వరకు ఎన్‌సీసీ విద్యార్థులకు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు, దివ్యాంగులకు, స్పోర్ట్స్ విభాగంలోని వారికి జూలై 3వ తేదీ, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వారికి జూలై 2,3 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. క్యాంపస్‌ల వారీగా ఎంపికైన విద్యార్థుల తుదిజాబితా జూలై 11న విడుదల చేస్తారని, నూజివీడు, ఆర్కే వ్యాలీలలో ఆయా క్యాంపస్‌లకు కేటాయించిన విద్యార్థులకు జూలై 22, 23 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందని, ఒంగోలు క్యాంపస్‌కు సంబంధించి జూలై 24, 25 తేదీల్లో, శ్రీకాకుళం క్యాంపస్‌కు సంబంధించి 26,27 తేదీల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

ప్రత్యేక కేటగిరిల్లో పోటాపోటీ

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో 2024 అడ్మిషన్‌లలో తీవ్ర పోటీ నెలకొంది. ఈసారి సాధారణ కేటగిరిలోనే కాక ప్రత్యేక కేటగిరిల్లో సైతం అడ్మిషన్లకు పోటీ నెలకొనడం విశేషం. క్రీడల విభాగంలో 0.5శాతం రిజర్వేషన్ క్రింద మొత్తం నాలుగు క్యాంపస్‌ల మీద 20 సీట్లను కేటాయించగా, 1162 మంది దరఖాస్తు చేశారు. అంటే ఒక్కో సీటుకు దాదాపు 58 మంది విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఇక సైనిక సంతతి విభాగంలో 40 సీట్లకు 2,587 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఇక్కడ ఒక్కో సీటుకు 64 మంది పోటీ పడుతున్నారు. ఎన్‌సీసీ విభాగంలో 80 సీట్లకు 1,830 మంది విద్యార్థులు దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 22.8 మంది పోటీ పడుతుండగా, స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 20 సీట్లకు 270 మంది దరఖాస్తు చేశారు. ఈ విభాగంలోనూ 14 మంది విద్యార్థులు పోటీ పడుతుండగా, ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మాత్రం 200 సీట్లకు 332 మంది దరఖాస్తు చేయగా, ఒక్కో సీటుకు 1.66 మంది విద్యార్థులు పోటీ ఏర్పడింది. మొత్తం మీద స్పెషల్ కేటగిరీలో ఒక ప్రత్యేక అవసరాలు కలిగిన విభాగంలో మినహా మిగిలిన అన్ని విభాగాల్లోనూ ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్‌లో ప్రవేశానికి తీవ్ర పోటీ నెలకొంది.

ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోవడం.. కొందరు రెవెన్యూ సిబ్బంది సహకారంతో హస్తగతం చేసుకోవడం వైసీపీ నేతలకు పరిపాటిగా మారింది. కొండలు, కుంటలు, గుట్టలు, చెరువులు దేన్నీ వదలడం లేదు. విలువైన ప్రభుత్వ భూములు కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే కబ్జారాయుళ్లకు సహకరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గతంలో మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే.. నేడు ఏకంగా నిత్యం అధికారులు తిరిగే హైవే రోడ్డు పక్కనే ఉన్న రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసేస్తున్నారు. రాత్రికి రాత్రే దున్నేసి ఫెన్సింగ్ వేస్తున్నారు. ఇలాంటి సంఘటనే పుల్లంపేట, రైల్వేకోడూరు మండలాల్లో చోటు చేసుకున్నాయి. ఒకచోట 5 ఎకరాలు కబ్జా చేస్తే.. మరో చోట 2.8 ఎకరాలు ఆక్రమించి హడలెత్తిస్తున్నారు.

రూ.5 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా

- కడప-చెన్నై రహదారి పక్కనే

2.8 ఎకరాల భూమి ఆక్రమణకు రంగం సిద్ధం

- రాత్రికి రాత్రే దున్నేసిన కబ్జారాయుళ్లు

పుల్లంపేట, జూన్ 28: మండలంలోని ఆదర్శ పాఠశాల సమీపంలో హైవేరోడ్డును ఆనుకుని 2.8 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. గతంలో కొంతమంది ఎస్సీలకు ఈ ప్రభుత్వ భూమిని డి.పట్టాలుగా ఇచ్చారు. వారు సాగులోకి తెచ్చుకోకుండా ఖాళీగా ఉంచడంతో అనంతయ్యగారిపల్లెకు చెంది అమెరికాలో వైద్యవృత్తి చేస్తున్న డాక్టర్ సంజీవరెడ్డి ఈ స్థలంలో పేద విద్యార్థులకు ట్రస్టు కింద ఉచిత విద్య అందించేందుకు కార్పొరేట్ పాఠశాలను, అలాగే చుట్టుపక్కల ప్రాంతాల వారికి మినరల్ వాటర్ అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ స్థలాన్ని ప్రభుత్వం దళితులకు డి పట్టాలు ఇచ్చారని తెలుసుకుని వారికి నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వానికి ఆ భూమిని తిరిగి ఇచ్చేవిధంగా ఒప్పందం చేసుకుని ప్రభుత్వానికి ఆ భూమిని అప్పగించారు. కానీ అధికారులు ఈ ట్రస్టు కింద పనులు చేపట్టేందుకు సహకరించక పోవడంతో ఫైలు మూతపడింది. అప్పటి నుంచి ఈ భూమిపై కొందరు కన్నేశారు. రాత్రికి రాత్రే ఈ భూమిని దున్నేశారు. వైసీపీకి చెందిన ఓ నాయకుడు ఎన్నికల్లో టీడీపీలోకి మారి ఈ భూమిపై కన్నేసి రాత్రికి రాత్రే దున్నేశాడు. అనంతయ్యగారిపల్లె పంచాయతీకి చెందిన వైసీపీ నాయకులు ఇది తమ భూమి, దళితుల నుంచి కొని తాము ప్రభుత్వానికి అప్పగించాము, మీరు ఎలా తమ ప్రాంతంలోకి వచ్చి దున్నుతున్నారని వాదోపవాదాలు జరిగాయి. దీంతో చేసేది లేక.. ఒక వారు ఒక ఒప్పందానికి వచ్చినట్లు సమాచారం. ఇంతలో విషయం తెలుసుకున్న కొందరు రెవెన్యూ అధికారులు.. ప్రభుత్వం మారింది, ఇబ్బందులు తలెత్తుతాయని వెంటనే ప్రభుత్వ స్థలం దున్నిన ప్రాంతాన్ని పరిశీలించారు. హైవేరోడ్డుపక్కనే ఈ స్థలం ఉండడం, సెంటు రూ.2 లక్షల వరకు విలువ ఉండడంతో ఈ భూమి విలువ రూ.5 కోట్ల పైమాటే ఉంటుంది. ఈ భూమిని ఏవిధంగానైనా దక్కించుకునేందుకు దొంగ పట్టాలు సృష్టించి విశ్వప్రయ త్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై పుల్లంపేట తహసీల్దారు వెంకట నారాయణను వివరణ కోరగా... ఇది ప్రభుత్వ భూమి అన్న మాట వాస్తవమేనని విచారణ చేపట్టి బాధితులపై చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో ఎవరైనా ప్రభుత్వభూములు ఆక్రమిస్తే కేసులు పెడతామని హెచ్చరించారు.

వైసీపీ నేత భూ దందా

- రూ.2 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జా
- 5 ఎకరాల్లో ఫెన్సింగ్
- దర్జాగా మామిడి మొక్కలు నాటిన వైనం



వైసీపీ నేత భూ దందాలో భాగంగా మామిడి మొక్కలు నాటిన దృశ్యం

రైల్వేకోడూరు, జూన్ 28: మండలంలోని రెడ్డివారిపల్లె హౌసింగ్ కాలనీలో శుక్రవారం ఓ వైసీపీ నేత భూ దందా వెలుగుచూసింది. ఏకంగా 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి యంత్రాలు పెట్టి చదును చేశారు. దర్జాగా ఫెన్సింగ్ వేసి మామిడి మొక్కలు నాటారు. వివరాల్లోకి వెళ్తే.. రెడ్డివారిపల్లె గ్రామ పంచాయతీలో గత వైసీపీ ప్రభుత్వంలో సుమారు 8 ఎకరాల్లో ఇంటి స్థలాలు మంజూరు చేసి.. వారికి పట్టాలూ మంజూరు చేశారు. చాలా మంది ఇళ్లను హౌసింగ్ శాఖ ద్వారా నిర్మాణాలు చేసుకుని నివాసాలు కూడా ఉంటున్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రభుత్వం ఓడినా.. ఇప్పటికీ వారి అక్రమాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా రెడ్డివారిపల్లె హౌసింగ్ కాలనీ వద్ద భూ దందా చేశారు. సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని యంత్రాలు పెట్టి చదును చేసి కొంత భాగంలో దర్జాగా మామిడి మొక్కలను నాటారు. ఈ భూమి విలువ సుమారుగా రూ.2 కోట్లు ఉంటుందని అంచనా. ఈ విషయాన్ని రైల్వేకోడూరు కూటమి నాయ కులు తహసీల్దార్ శివ రాముడుకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. తహసీ ల్దార్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. పనులు జరుగుతున్న స్థలం వద్దకు వీఆర్వోను పంపించి పనులను నిలిపివేయించామని, భూమికి సంబంధించిన రికార్డులను తెప్పించుకుని చర్యలు తీసుకుంటామని వివరించారు. ఈ భూమికి సంబంధించి అన్ని కోణాల్లో విచారణ చేస్తామన్నారు.

మున్సిపాలిటీ బాగుపడేనా..?

- నూతన ప్రభుత్వంలో కొండంత ఆశ
- అసంపూర్తిగా జాతీయ రహదారి, రింగ్ రోడ్డు పనులు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- అరకొరగా అండర్ డ్రైనేజీ పనులు



చెన్నముక్కపల్లె సమీపంలో అసంపూర్తిగా ఉన్న రింగు రోడ్డు

రాయచోటిటౌన్, జూన్ 28: జిల్లా కేంద్రమైన రాయచోటి స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ నూతన టీడీపీ ప్రభుత్వంలోనైనా బాగుపడేనా అని పట్టణ ప్రజలు కొండంత ఆశతో ఎదురు చూస్తున్నారు. సుమారు లక్షకు పైగా జనాభా కలిగిన రాయచోటి మున్సిపాలిటీ వైసీపీ ప్రభుత్వంలో మున్సిపాలిటీగా, గ్రేడ్ వన్ మున్సిపాలిటీగా, స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయినప్పటికీ సౌకర్యాలు మాత్రం గ్రామ పంచాయతీ కంటే అధ్వానంగా ఉన్నాయి. మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఎక్కడ పడితే డ్రైనేజీ కాలువలు చెత్తాచెదారంతో నిండిపోయి మురుగునీరు రోడ్లపైన ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారుతోంది. గడిచిన వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా కేవలం మరో ఆరు నెలల్లో ఎన్నికలు వస్తాయనే సమయంలో వైసీపీ కౌన్సిలర్లు, నాయకులు హడావిడిగా అక్కడక్కడ కొన్ని వీధులకు సిమెంటు రోడ్లు వేసి చేతులు దులుపుకున్నారు.

గతంలో రాయచోటి మున్సిపాలిటీ ఏర్పడిన సమయంలో పీఎల్ఆర్ కంపెనీ ద్వారా చేపట్టిన డ్రైనేజీ పనులు అస్తవ్యస్తంగా చేయడంతో ప్రస్తుతం వర్షాలు వచ్చిన సమయంలో మురుగునీరు అంతా దిగువ ప్రాంతాలకు వెళ్లి స్లమ్ ఏరియాల్లో నీరు నిలిచి ఇళ్లలోకి వస్తుండడంతో కొత్తపల్లె, మేదరపల్లె, మహబూబ్‌నగర్, పూలతోటపల్లి తదితర ప్రాంతాల్లో నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ పేరుతో ప్రజల నుంచి లక్షలాది రూపాయలు స్థలాలు, ఇండ్ల అప్రూవల్‌కు మున్సిపాలిటీ వసూలు చేస్తున్నప్పటికీ సౌకర్యాలు కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వెలిగల్లు నీటి పథకం నుంచి వస్తున్న నీటి సరఫరా మూడు రోజులకు, ఐదు రోజులకు, వారానికి ఒకరోజు వస్తుండడంతో పట్టణ ప్రజలకు నీటి సమస్య కూడా తప్పడం లేదు. క్రమం తప్పకుండా ఇంటి పన్ను, నీటి పన్ను, గ్రంథాలయం పన్ను వసూలు చేస్తున్న మున్సిపాలిటీ అధికారులు మౌలిక వసతులు కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. నూతన ప్రభుత్వంలోనైనా రాయచోటి మున్సిపాలిటీకి మంచిరోజులు వస్తాయా అని పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

అసంపూర్తిగా పనులు

రాయచోటి పట్టణం గుండా వెళుతున్న కర్నూలు- చిత్తూరు జాతీయ రహదారి పనులు అసంపూర్తిగా ఉన్నాయి. 2018 సంవత్సరంలో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రారంభమైన నాలుగు వరుసల జాతీయ రహదారి పనులను వైసీపీ ప్రభుత్వం ఐదు సంవత్సరాల్లో పూర్తి చేయలేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. జిల్లా కేంద్రం తీసుకొచ్చాం. అభివృద్ధిని పరుగులు తీయించామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ నేతలు రాయచోటి పట్టణంలో జాతీయ రహదారికి ఇరువైపులా సిమెంటు రోడ్డు పూర్తి చేయకపోవడం డ్రైనేజీని పూర్తి చేయకుండా అలాగే వదిలేయడం చూస్తే వారికి పట్టణ అభివృద్ధిపై ఏ మాత్రం శ్రద్ధ ఉందో తెలుస్తోందని పలువురు విమర్శిస్తున్నారు. ప్రధానంగా పట్టణంలోని ఠానా వద్ద మాసాపేట తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి పనులు పూర్తికాకుండా అసంపూర్తిగా ఉన్నాయి. అలాగే 2009 సంవత్సరంలో దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలో ప్రారంభమైన రాయచోటి పట్టణం చుట్టూ రింగు రోడ్డు నిర్మాణం పనులు 15 ఏళ్లు గడుస్తున్నా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఉన్న శ్రీకాంత్‌రెడ్డి పూర్తి చేయకపోవడంపై వాహనదారులతో పాటు పట్టణ ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఇకపోతే రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ నుంచి బస్టాండు వరకు సుందరీకరణ పనులను చేపడతామని చెప్పిన గత మాజీ ఎమ్మెల్యే తన పదవీకాలం ముగిసినంత వరకు పనులను చేపట్టకపోవడంతో ప్రస్తుతం బస్టాండ్ రోడ్డు సుందరీకరణకు నోచుకోక బోసిపోయింది. బస్టాండు రోడ్డులో ఒకవైపు ఆక్రమణలు తొలగించి డ్రైనేజీ నిర్మాణం చేపట్టినప్పటికీ విద్యుత్ స్తంభాలను తొలగించకుండా అలాగే రోడ్డు మధ్యలో వదిలేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. అలాగే పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలన్న ఉద్దేశ్యంతో పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గ్రాస్ ల్యాండ్ స్థలంలో ఉన్న అక్రమ కట్టడాలను 2017 సంవత్సరంలో తొలగించిన మున్సిపల్ అధికారులు ఇంతవరకు ఆ స్థలంలో ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో ఆ స్థలం ప్రస్తుతం ప్రైవేటు వాహనాలకు పార్కింగ్ స్థలంగా మారింది. కాగా నూతనంగా ఎమ్మెల్యేగా విజయం సాధించడంతో పాటు మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మున్సిపాలిటీపై ప్రత్యేక దృష్టి సారించి మౌలిక వసతులు కల్పిస్తారని రాయచోటి మున్సిపాల్టీ ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.

ప్రశ్నార్థకంగా అండర్ డ్రైనేజీ పనులు

రాయచోటిలో మురుగునీరు ఎక్కడా కనిపించకుండా చేస్తామని అప్పటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆగమేఘాలపైన రూ.300 కోట్లతో చేపట్టిన అండర్ డ్రైనేజీ పనులు అరకొరగానే ముగిశాయి. రాయచోటి మున్సిపాలిటీని వదిలేసి అండర్ డ్రైనేజీ పనులను పొందిన కాంట్రాక్టర్లు రాయచోటి చుట్టుపక్కల చెన్నముక్కపల్లె, దూళ్లవారిపల్లె, ఇందిరమ్మకాలనీ, ఎస్టీకాలనీ, మాసాపేట ఇలా పట్టణానికి సంబంధం లేకుండా కేవలం 20 శాతం పనులు మాత్రమే ఊరిబయట చేపట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండి డ్రైనేజీ కాలువలన్నీ చెత్తాచెదారంతో నిండిపోయి రోడ్లపైన ప్రవహిస్తూ పాదచారులకు, వాహనదారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇక వర్షాలు వచ్చిన సమయంలో మురుగు, వరద నీరు కలిసి దిగువ ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వెళ్లడంతో వస్తువులన్నీ నీట మునిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి.



కొత్తపేట ఎన్జీవో కాలనీకి వెళ్లేదారిలో గడ్డి, కంపచెట్లతో మూసుకుపోయిన డ్రైనేజీ కాలువ



ఎస్ఎన్‌కాలనీ గ్రాస్‌ల్యాండ్ స్థలంలో ప్రైవేటు వాహనాలను పార్కింగ్ చేసిన దృశ్యం



కొత్తపేటలో కల్వర్టులు లేక డ్రైనేజీ నిండి రోడ్డుపై పారుతున్న మురుగునీరు

బిజీ బిజీగా మంత్రి మండిపల్లి

● మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడును కలిసిన మంత్రి
మాసాపేటలో ఎస్కే కుటుంబీకులతో సమావేశం ● సమస్యలు విన్నవించిన టీడీపీ నేతలు, మున్సిపల్ కార్మికులు

రాయచోటిటౌన్, జూన్28: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి శుక్రవారం బిజీ బిజీగా గడిపారు. మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపీ సుగవాసి పాలకొండ్రాయుడు, పలువురు పెద్దలు, అభిమానులను కలిశారు. గాలివీడు రోడ్డులోని పాలకొండ్రాయుడు స్వగృహానికి వెళ్లి పెద్దాయనతో పలువిషయాలను ఏకాంతంగా చర్చించారు. అనంతరం పాలకొండ్రాయుడు మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎస్కే బ్రదర్స్ అండ్ సన్స్‌తో మంత్రి

మాసాపేటలో ఎస్కే పాలకొండ్రాయుడు బ్రదర్స్ అండ్ సన్స్ ఏర్పాటు చేసిన తేనేటి విందుకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాసాపేట ప్రజలు ఘనస్వాగతం పలికారు. తన గెలుపు కోసం సహకరించిన కార్యకర్తలు, అభిమానులు, నేతలకు మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం రాయచోటి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అభిమానులు కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. కార్యకర్తలు, అభిమానులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

జిల్లాలో మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని రాయచోటిలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ నేతలు కలిసి వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల



పాలకొండ్రాయుడుతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి - మంత్రి మండిపల్లికి సమస్యలు విన్నవిస్తున్న మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు

సమస్యలు పరిష్కారిస్తామని చెప్పి మోసగించిందన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పి మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి ఆదుకోవాలని కోరారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు హరిప్రసాద్, శేషాద్రి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

విన్నవించిన టీడీపీ నేతలు

సుండుపల్లె, జూన్28: మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డిని సుండుపల్లె మండల టీడీపీ, బీజేపీ, జనసేన నేత లు శుక్రవారం కలిసి పలు సమస్యల ను వినతి పత్రం రూపంలో అందజేసినట్లు తెలిపారు. అర్ధంతరంగా ఆగి పోయిన రాయచోటి - రాయవరం డబుల్ రోడ్డును పూర్తి చేయాలన్నారు. తిమ్మసముద్రం నుంచి కొండల తూర్పు వరకు రోడ్డు గుంతలమయమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్‌రాజు, బీజే పీ జిల్లా నేత వెంకట్రా మరాజు, జనసేన నేత రామశ్రీనివాస్, టీడీపీ నేతలు సుబ్బరామరాజు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్టాఫ్ నర్సులు....

చిన్నమండెం, జూన్28: రాష్ట్ర మంత్రి వర్యులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి జిల్లా, మండల స్టాఫ్ నర్సులు, స్టాగుల్ కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలపై ఆయనకు వినతి పత్రం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని వారు మంత్రికి వివరించారు. దీనిపై ఆయన అనుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కారమయ్యేందుకు కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న బాలసుబ్రమణ్యం

వీరబల్లి, జూన్28: సుపరిపాలనే ప్రభుత్వ లక్ష్యమని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల మహిళా సమాఖ్య వార్షిక మహాసభలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలకు విశిష్ట స్థానాన్ని కల్పించింది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. బ్యాంకు రుణాలపై రూ.10 లక్షల వరకు వడ్డీశాతం ప్రభుత్వం భరిస్తుందన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సత్యనారాయణ మాట్లాడుతూ జూలై పింఛన్లు జిల్లా వ్యాప్తంగా రూ.152 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయిస్తున్నామన్నారు. టీడీపీ నేతలు రెడ్డెప్పరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పద్మనా భరెడ్డి సీఆర్పీ ఫైనాన్స్ మేనేజర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ఏపీఎం గంగార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసిన పంతగాని, చమర్తి



పల్లా శ్రీనివాస్‌ను సన్మానించిన పంతగాని - రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

రైల్వేకోడూరు, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన పల్లా శ్రీనివాస్‌యాదవ్‌ను శుక్రవారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ కలిసి ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు ఎవరికి ఏ స్థానం కల్పించాలో తెలుసన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పకుండా సుముచిత స్థానం కల్పిస్తారన్నారు.

పల్లాతో చమర్తి భేటీ

రాజంపేట, జూన్ 28: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన పల్లా శ్రీనివాస్‌ను రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు కలిసి సత్కరించారు. వారు తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

30న పాటల పోటీలు

రైల్వేకోడూరు, జూన్ 28: స్థానిక ఎస్పీ ఎల్‌సీ పాఠశాల ప్రాంగణంలో 30న పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు భాను సినీ ఆర్కెస్ట్రా నిర్వాహకులు తిరుపాలు తెలిపారు. ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా పాటలు, సంగీత విభావరి, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పాటల పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు రూ. 100 రుసుము చెల్లించాలన్నారు.

ఘనంగా గంగమ్మ నిమజ్జనం

రైల్వేకోడూరు, జూన్ 28: రెడ్డివారిపల్లె, ఉప్పరపల్లె, బిల్లుపాటిపల్లెల్లో గురువారం గంగమ్మతల్లి జాతరలు నిర్వహించారు. శుక్రవారం గంగమ్మతల్లిని ఘనంగా నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

రాజంపేట, జూన్ 28: రాజంపేట న్యాక్ సెంటర్‌లో వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్లు సెంటర్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రాకేష్ తెలిపారు. టైలరింగ్, ఎలక్ట్రీషియన్, సీసీ కెమెరా టెక్నీషియన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. టెన్త్ పాసై 18 నుంచి 35 ఏళ్ల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జూలై 9న దరఖాస్తు ఆధార్, రేషన్‌కార్డు, సర్టిఫికెట్లు 2 ఫొటోలు జత చేసి అప్లికేషన్ ఇవ్వాలన్నారు.

'దుల్హన్' అమలు ఆదేశాలపై హర్షం

రైల్వేకోడూరు(రూరల్) జూన్ 28: ఎన్నికల్లో మైనార్టీలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాటప్రకారం అధికారంలోకి రాగానే దుల్హన్ పథకంను వెంటనే అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇవ్వడం హర్షణీయమని రైల్వేకోడూరు టీడీపీ నేతలు కొనియాడారు. పట్టణంలోని జామీయా మజీద్ ఆవరణ వద్ద చంద్రబాబుకు జేజేలు పలికారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ జుబేర్, సీనియర్ నేతలు పటాన్ మౌలా, మాజీ వార్డు సభ్యులు షేక్ మస్తాన్, జామీయా మజీద్ ముత్తువల్లి షేక్ షబ్బీర్, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు : ఏపీడీ

చిట్వేలి, జూన్ 28: ఉపాధిలో అక్రమాలకు పాల్పడితే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఉపాధి ఏపీడీ ప్రతాప్ అన్నారు. సి.కందువారిపల్లె పంచాయతీ ఉపాధి పనుల అక్రమాలపై, ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థుల ఆరోపణల నేపథ్యంలో శుక్రవారం ఉపాధి ఏపీఓ చంద్రకళ కలిసి ఏపీడీ ప్రతాప్ సచివాలయంలో విచారణ చేపట్టారు. ఉపాధి పనిలో ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలకు పాల్పడ్డారని నిర్ధారించారు. జాబ్ కార్డు తయారీకి నగదు తీసుకోవడం, అటవీశాఖ వారి పేర్లతో కూలీల దగ్గర నగదు వసూలు చేయడం, ఉద్యోగం ఉండి ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం, పనులకు వెళ్లనివారికి హాజరు వేసి వచ్చిన నగదును భాగాలుగా పంచుకోవడం వంటి ఫిర్యాదులపై గ్రామస్థులతో కలిసి ఏపీడీ పరిశీలించారు. విచారణలో భాగంగా ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడిని విచారించారు. విచారణలో జాబ్‌కార్డు ఉండి పనులకు వెళ్లకుండా నగదు తీసుకుంటున్నట్లు విచారణలో గుర్తించారు. ఏపీడీ ప్రతాప్‌ను వివరణ కోరగా సేకరించిన ఆధారాలను ఉన్నతస్థాయి అధికారులకు, కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలురెడ్డయ్య, సీనియర్ నేతలు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు, కాకర్ల నాగార్జున, సీపీ మల్లికార్జున, పంచాయతీ ప్రజలు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

'సికిల్‌సెల్ ఎనీమియా' పట్ల అప్రమత్తంగా ఉండండి

చిట్వేలి, జూన్ 28: జన్యుపరంగా సంక్రమించే సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి అత్యంత ప్రమాదకరమని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఐసీడీఎస్ చిట్వేలి ప్రాజెక్టు సీడీపీఓ రాజేశ్వరి సూచించారు. శుక్రవారం చిట్వేలి మండలం గట్టుమీదపల్లె ఎస్టీకాలనీలో సికిల్‌సెల్ అనిమియా వ్యాధిపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఈవ్యాధి అత్యంత ప్రమాదకరమని వంశపారంపర్యంగా సంక్రమించే ఈ వ్యాధి పట్ల ప్రజలు, ప్రత్యేకించి మహిళలు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ గ్రేడ్-2 సూపర్‌వైజర్ సురేఖ రాణి, గట్టుమీదపల్లె ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ, ఉపాధ్యాయులు వసంత, అంగన్వాడీ వర్కర్ వెంకటసుబ్బమ్మ, గ్రామ మహిళలు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎస్సీ రైతులకు పట్టలు, డ్రమ్ములు పంపిణీ

సంబేపల్లె, జూన్28: ఉమ్మడి కడప జిల్లాలో ప్రకృతి వ్యసాయంపై ఆసక్తి చూపుతున్న ఎస్సీ రైతులకు ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేసినట్టు సంబేపల్లె మాజీ సర్పంచ్ నాగేశ్వర్‌నాయుడు తెలిపారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు ఆసక్తి చూసేందుకు ఉమ్మడి కడప జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ సహకారంతో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. మండలానికి 115 సెట్ల డ్రమ్ములు పట్టలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంయూ సిబ్బంది యశోద, మానస టీడీపీ నేతలు నాగేశ్వర్‌నాయుడు, మాదంబసిరెడ్డి, పవన్‌కుమార్‌రాజు, రామాంజులురెడ్డి, మట్లి వేణుగోపాల్‌నాయుడు, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నా ఇల్లు ఇప్పించండి సార్...

● జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం

రాయచోటి(కలెక్టరేట్), జూన్28: అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం వాసి దివ్యాంగురాలు షాహిదా ఇంటిని ఓ దుర్మార్గుడు అద్దెకి తీసుకుని రిజిస్టర్ చేయించుకున్నట్లు జాయింట్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది. వివరాలిలా ఉన్నాయి. తన ఇంట్లో అద్దెకు ఉంటున్న వ్యాపారి హబీబ్ ఇంటిని రిజిస్టర్ చేయించుకుని బయటకు గెంటేశారని ఆమె శుక్రవారం మీడియా ఎదుట వాపోయింది. విషయంపై చాలా రోజుల నుంచి రెవెన్యూ అధికారులు చుట్టూ తిరిగినా ఉపయోగం లేకపోవడంతో కలెక్టర్‌కు మొరపెట్టుకోవాలని ఇక్కడికి వచ్చామని ఆమె తెలిసింది. విషయంపై జేసీ ఫర్మాన్ అహ్మద్ స్పందిస్తూ ఈ విషయాన్ని పూర్తి స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఆమె తెలిపారు.

వీరభద్రాలయంలో రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, జూన్ 28: స్థానిక భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈఓ రమణారెడ్డి ఆధ్వర్యంలో భద్రకాళీ అమ్మవారికి కరుమార్చనలు చేసి ఇంకా రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో సర్వాంగ సుందరంగా అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో భద్రకాళీ అమ్మవారు

భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. భద్రకాళీ అమ్మవారికి కుంకుమార్చనలు, రక రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అమ్మవారిని అలంకరిచి భక్తులకు దర్శనం కల్పించారు.

'ఉపాధి' అవినీతిపై విచారణ చేపట్టాలి

ఎంపీడీఓకు ఫిర్యాదు - ఏపీఓకు మెమో



ఉపాధిలో అక్రమాలపై ఎంపీడీఓను నిలదీస్తున్న టీడీపీ నేతలు

పుల్లంపేట, జూన్ 28: మండలంలో జరిగిన ఉపాధి పనుల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వెంటనే విచారణ చేపట్టాలని మండల టీడీపీ నేత ఎంపీడీఓ నరసింహమూర్తికి ఫిర్యాదు చేశారు. శుక్రవారం మూకుమ్మడిగా టీడీపీ నేతలు ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లు అక్రమాలకు పాల్పడుతున్నారని, కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అక్రమాలకు మండలం అడ్డాగా మారిందని, పనులు నిలిపి విచారించాలన్నారు. ఉపాధిలో అక్రమాలు జరుగుతున్నా ఎందుకు పట్టించుకోలేదని నిలదీశారు. ఎంపీడీఓ ఏపీఓకు ఫోన్‌చేసినా స్పందించలేదు. గంట తర్వాత తిరుపతికి వెళుతున్నానని ఏపీఓ శ్రీనివాసులు ఎంపీడీఓకు సమాచారం ఇచ్చారు. ఏపీఓ నిర్లక్ష్యానికి ఎంపీడీఓ మెమో జారీ చేశారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి ఆది సుధాకర్‌నాయుడు, నేలపాటి రామచంద్రనాయుడు, కృష్ణమనాయుడు, కాకర్ల చంద్రశేఖర్‌నాయుడు, ముద్దా గంగిరెడ్డి, కావేటి వెంకటసుబ్బయ్యయాదవ్, దేవరకొండ నరసింహులు, జగదీశ్వర్‌రెడ్డి, వడ్డేపల్లె రమణ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి లో ముందడుగు : ఎమ్మెల్యే



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ నేత ముక్కా రూపానందరెడ్డి

రైల్వేకోడూరు, జూన్ 28: ఆర్టీసీ బస్టాండు అభివృద్ధి పనుల్లో భాగంగా ప్రహరీ ఏర్పాటుకు రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో చేయలేని పనులు చేసి చూపిస్తామన్నారు. ఆర్టీసీ బస్టాండును ఏనాడూ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. సరైన వసతులు లేవన్నారు. ప్రయాణీకుల కోసం బస్టాండును వేగవంతంగా నిర్మిస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో ఇది మొదటి అడుగు పెట్టామన్నారు. ఎక్కడా రాజీ లేకుండా పనులు చేస్తామన్నారు. ప్రజలకు ఏదైతే హామీలు ఇచ్చామో అవన్నీ చేసి చూపిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీడీపీ నేతలు



సీఎం చంద్రబాబుతో టీడీపీ నేత రమేష్‌నాయుడు

ఓబులవారిపల్లె, జూన్ 28: కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబును మండల టీడీపీ నేతలు నాగినేని రమేష్‌నాయుడు కలిసినట్లు తెలిపారు. సీఎంగా మొదటిసారి కుప్పంకు విచ్చేసిన సందర్భంగా ఆయనను కలిసినట్లు తెలిపారు.

'మానవత' కమిటీ ఎన్నిక

రాయచోటిటౌన్, జూన్28: మానవతా శాఖ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు చైర్మెన్ అరమాటి శివగంగిరెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు సహదేవరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఆనందరెడ్డి తెలియజేశారు. 2024-25 రాయచోటి మానవత నూతన అధ్యక్షుడిగా ఖాదర్‌బాషా, కార్యదర్శిగా అంకం జయచంద్రారెడ్డి, కోశాధికాగా మురళీ మోహన్, ఉపాధ్యక్షుడిగా గంగాధర్‌నాయుడు, కార్యవర్గ సభ్యులు వీ. శ్రీధర్‌రెడ్డి. బీ. నాగేశ్వర్, పీ. ఈశ్వరయ్య, ఎస్. అల్లాబకష్, ఎస్. అష్రఫ్‌అలీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

మట్టి నమూనాతో రైతులకు ఎంతో మేలు

ఓబులవారిపల్లె, జూన్ 28: రైతుల పొలాల్లో పంటలు పండించే ముందు మట్టి నమూనా పరీక్షలు చేయించడం ఎంతో మేలని ఏఓ మల్లిక సూచించారు. వర్షాకాలం మొదలవడంతో మండల రైతులు నూతన పంటల సాగుకు సిద్ధమవుతున్న సందర్భంగా చిన్నఓరంపాడు రైతులు ఆర్‌బీకే సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి రైతులకు వారి పొలాల్లోకి వెళ్లి మట్టి నమూనా పరీక్షలు చేసేందుకు మట్టిని సేకరించే విధానాన్ని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది బుల్లయ్య, ఆర్‌బీకే ఇన్‌చార్జి నందిని, మధు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నేతలు

రాజంపేట, జూన్ 28: ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు మన్నూరు ఉన్నత పాఠశాలలో శుక్రవారం మొక్కలు నాటారు. రాజంపేట బీజేపీ నేత, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు, మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు ఎస్.అబ్దుల్లా, ఆదినారాయణ, పాపయ్య, రమణ తదితరుల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. నేడు అనేక కారణాల వల్ల పర్యావరణం బాగా దెబ్బతినడం వల్ల ఇటీవల వేసవిలో 50 డిగ్రీలు పైబడి ఉష్ణోగ్రతలు పెరిగాయన్నారు.

సహజవాయువుల వినియోగంపై అవగాహన

సంబేపల్లె, జూన్28: సహజ వాయువుల వినియోగంపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆదర్శ పాఠశాలలో ఇండేన్ గ్యాస్ ఆధ్వర్యంలో సహజ వాయువుల సద్వినియోగంపై అవగాహన చేపట్టారు. విద్యార్థినులకు గ్యాస్ వినియోగం, గ్యాస్ వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సహజ వనరులైన సోలార్, విండ్, టైడల్ ఎనర్జీలపై మన భవిష్యత్తు ఆధారపడి ఉందని తెలియజేశారు. కార్యక్రమంలో విద్యార్థినులు, ఉపాధ్యాయులు, ఇండేన్ గ్యాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పెన్షన్ అందరికీ అందేలా చూడాలి

సిద్దవటం, జూన్ 28: పెన్షన్ పంపిణీ సజావుగా సాగాలని ఎంపీడీఓ ఉమామహేశ్వర్‌రావు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అందరికీ అందేలా చూడాలని ఎక్కడా నిర్లక్ష్యం వహించకుండా ఇంటివద్దకు వెళ్లి అందజేయాలని తెలిపారు. జూలై 1వ తేదీ ఉదయం నుంచీ పెన్షన్ ప్రారంభించాలని మండల అభివృద్ధి అధికారి తెలియ జేశారు. వృద్ధులకు, దివ్యాంగులకు, వితంతువులకు అర్హులైన ప్రతిఒక్కరికీ పెన్షన్ అందేలా చూడాలని, సచివాలయం కార్యదర్శులు అన్ని చర్యలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఏలు, డిజిటల్ అసిస్టెంట్‌లకు ఎంపీడీఓ తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు మాధవీలత ఎస్ఐ పెద్ద ఓబన్న, సచివాలయ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించిన రూపానందరెడ్డి

పుల్లంపేట, జూన్ 28: కొత్తపేట పంచాయతీలో ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి పునః ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు టీడీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజల స్రవంతి కింద మంజూరు చేసిందన్నారు. మండల ఇన్‌చార్జి సుధాకర్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రామచ్రందయ్య నాయుడు, కోడూరు కృష్ణమనాయుడు, లింగుట్ల వెంకటరమణ, కాకర్ల చంద్రశేఖర్‌నాయుడు, మమ్మినేని విజయకుమార్, మాజీ ఎంపీపీ తిరుపాలు, శ్రీనివాసరాజు, ముద్దా గంగిరెడ్డి, కావేటి వెంటసుబ్బయ్య యాదవ్, ఈశ్వర్‌నాయుడు, కొండేటి రమణ, కేసినేని నారాయణనాయుడు, వడ్డిపల్లె రమణ పాల్గొన్నారు.

డీలర్లకు సరుకులు సకాలంలో అందించండి : జేసీ



సరుకుల గోదామును తనిఖీ చేస్తున్న జేసీ

లక్కిరెడ్డిపల్లె జూన్28: ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులు చౌకదుకాణ డీలర్లకు సకాలంలో అందిస్తే ప్రజలకు పంపిణీ చేస్తారని అన్నమయ్య జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లె నిత్యావసర సరుకుల గోదామును తనిఖీ చేశారు. గోదాములో బియ్యం, సరుకులు ఎక్కువగా ఉన్నాయని ఇంత వరకు ఎందుకు డీలర్లకు అందించలేదని ఇన్‌చార్జి మల్లికార్జునబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గోదాము నిర్వాహణలో అవకతకలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. స్టాక్ రిజిస్టర్లను దిగుమతి ఫైల్స్‌ను పరిశీలించారు. తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవన్నారు. ప్రతి నెలా 28 తేదీలోపు సరుకులు డీలర్లకు అందజేయాలన్నారు. తహసీల్దార్ కుమారస్వామి, ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ ఉస్మాన్‌సాహెబ్, ఆర్ఐ సమ్మత్‌ఖాన్, గోదాము సిబ్బంది పాల్గొన్నారు

లా సెట్‌లో మల్లీశ్వరికి 1024వ ర్యాంకు



పెనగలూరు, జూన్ 28: లా సెట్‌లో గంధ్ర మల్లీశ్వరి రాష్ట్రస్థాయిలో 1024 ర్యాంకు సాధించినట్లు ఆమె తండ్రి శ్రీనివాసులు నాయుడు తెలిపారు. రెండో రోజుల కిందట వెలువడిన లాసెట్ ఎంట్రన్స్ ఫలితాల్లో ఆమె ఈ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ఎస్వీ యూనివర్శిటీ మహిళా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సి.భువనేశ్వరి మల్లీశ్వరిని అభినందించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలంటూ వినతి

గాలివీడు, జూన్28: తలముడిపి, కొర్లకుంట, పదికుంట గ్రామాల విద్యార్థుల కోసం బస్సు సర్వీసు నడపాలని ఓల్డ్ స్టూడెంట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. గ్రామీణ విద్యార్థులు నూలివీడు జడ్పీ హైస్కూల్‌కు వెళ్లి చదువుకోవాలంటే పాఠశాల సమయానికి బస్సులు నడపాలన్నారు. స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

వాహనం సహా 'ఎర్ర' దుంగలు స్వాధీనం

● ఒకరి అరెస్టు.. ఇద్దరు పరార్

● ఎర్రచందనం స్మగ్లింగ్‌లో ఇద్దరు పోలీసులు



బద్వేలు రూరల్, జూన్ 28 : రాణిబావి సమీపం లోతువంక బీట్ గాజులగొంది వద్ద వాహనంలో రవాణాకు సిద్ధంగా ఉంచిన నాలుగు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసరు శేషయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కూంబింగ్‌లో భాగంగా రాణిబావి సమీపంలోని లోతువంక బీట్ గాజులపల్లె వద్దకు వెళ్లగానే ఇథియోస్ వాహనం ఎదురు పడిందన్నారు. దానిని తనిఖీ చేసేందుకు ప్రయత్నించగా కారులో ఉన్న ఇద్దరు పరారు కాగా, డ్రైవర్ షఫీవుల్లాను అరెస్టు చేసి వాహనంతో సహా నాలుగు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నామన్నారు. పరారైన వ్యక్తులు రేకలకుంట్లకు చెందిన గంజినాయుడు, నాగసానిపల్లెకు చెందిన బ్రహ్మనాయుడుగా గుర్తించామన్నారు. లోతువంక బీట్ గాజులగొంది వద్ద పట్టుబడ్డ ఎర్రచందనం స్మగ్లింగ్‌లో పోలీసుల పాత్ర ఉన్నట్లు ఇన్‌చార్జి ఫారెస్టు ఆఫీసరు శేషయ్య తెలిపారు. బద్వేలు అర్బన్ పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సుధాకర్, అట్లూరు పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న రామక్రిష్ణ వీరికి సహకారం అందిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. వీరందరూ ఓ గ్రూపుగా ఎర్రచందనం దుంగలను తరలించేందుకు సిద్ధంగా ఉంచారని విచారణలో తేలిందన్నారు. వీరందరినీ త్వరలోనే పట్టుకుంటామన్నారు.

ఘాట్‌లో లారీని ఢీకొన్న మరో లారీ



సీకేదిన్నె, జూన్ 28: కడప-రాయచోటి జాతీయ రహదారిపై గువ్వలచెరువు ఘాట్ 4వ మలుపు వద్ద ఆగి ఉన్న లారీని వెనుకవైపు నుంచి మరో లారీ ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అయితే ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదు. ఈ ఘటనలో లారీ ముందుభాగం దెబ్బతింది. ఘటనలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

జాగ్రత్తలతో డయేరియా నివారణ

డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు



అవగాహన కల్పిస్తున్న డీఎంఅండ్ హెచ్ఓ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూన్ 28: కలుషితమైన తాగు నీరు, ఆహారం తినడం వల్ల అతిసార వ్యాధి ప్రబలే అవకాశం ఉందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం నగర కార్పొరేషన్ పరిధిలోని పాతకడపలో వైద్యసిబ్బంది చేపట్టిన డ్రైడే-ఫ్రైడే కార్యక్రమాన్ని డీఎంఅండ్ హెచ్ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా లాంటి విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. నిల్వ ఉన్న నీటిలో దోమలు ఉత్పత్తి జరిగే అవకాశం ఉందన్నారు. దోమకాటు వల్ల విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. వారానికి ఒకసారి అయినా తాగునీరు నిల్వ చేసుకునే బానలు, తొట్లు, కుండలను శుభ్రం చేసుకుని కొంత సేపు ఎండబెట్టాలన్నారు. అప్పుడు దోమలు పెరిగేందుకు అవకాశం ఉండదన్నారు. అలాగే డయేరియా నియంత్రణకు తాగునీరు కాచి చల్లార్చి తాగాలన్నారు. కుళాయిలు లీకేజీ ఉంటే వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. తాగునీటి పైపుల్లో బురద నీరు వస్తోందని పాతకడపవాసులు డీఎంఅండ్‌హెచ్ఓ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే రూరల్ వాటర్ ఇంజనీరింగ్ అధికారిని పిలిపించి మరమతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మలేరియా అధికారిణి మనోరమ, అసిస్టెంట్ అధికారి వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీరెడ్డి, శంకర్ రెడ్డి, ఇంతియాజ్, వైద్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశ పరీక్షలో 4వ ర్యాంక్



ముజఫర్ హుస్సేన్

గాలివీడు, జూన్28: ఏపీ పీజీ సెట్ ఫలితాల్లో గాలివీడు విద్యార్థి ముజఫర్ హుస్సేన్ 4వ ర్యాంకు సాధించాడు. పెద్దూరులో నివాసముంటున్న షేక్ మహమ్మద్ కుమారుడు ముజఫర్ హుస్సేన్ ఉర్దూ విభాగంలో మెరుగైన ర్యాంకును సాధించాడు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశానని, ఎస్వీ యూనివర్శిటీలో ఎంఏ (ఉర్దూ) పూర్తి చేసి యూపీఎస్సీ ద్వారా ఉద్యోగం సాధించాలన్నదే తన ఆశ యమని విద్యార్థి తెలిపారు.

గండి దేవస్థాన సహాయ కమిషనర్‌గా వెంకటసుబ్బయ్య

చక్రాయపేట, జూన్ 28: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వామి దేవస్థాన సహాయ కమిషనర్‌గా జె.వెంకటసుబ్బయ్య నియమితులయ్యారు. గండి దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న అలవలపాటి ముకుందరెడ్డిని కమిషనర్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటసుబ్బయ్య నెల్లూరు జిల్లా రాజేశ్వరి అమ్మవారి దేవస్థానం నుంచి గండికి బదిలీ అయ్యారు.

పంచాయతీలను సర్వనాశనం చేశారు

- 14, 15 ఫైనాన్స్ నిధులను దారిమళ్లించారు
- స్టాంప్ డ్యూటీ.. స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇవ్వలేదు
- 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సమీక్షలో...
- వైసీపీ ప్రభుత్వ తీరుపై సర్పంచ్‌ల ఆగ్రహం

కడప(రూరల్) జూన్ 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను సర్వనాశనం చేశారని, తమకు కనీసం గ్రామ వలంటీర్లకు ఇచ్చే గౌరవం కూడా ఇవ్వలేదని సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో శుక్రవారం సాయంత్రం గ్రామ పంచాయతీ నిధులు - ఖర్చు - ఆదాయ వనరుల పెంపు అంశాలపై 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందం సర్పంచ్‌లతో సమీక్ష నిర్వహించింది. ఈ కార్యక్రమం ప్రారంభం కాగానే ఉమ్మడి కడప జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి, పోరుమామిళ్ల మేజర్ పంచాయతి సర్పంచ్ సుధాకర్ తదితరులు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం గ్రామపంచాయతీల వ్యవస్థను కోలుకోలేని రీతిలో సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పంచాయతీలకు సమకూరే 14, 15 ఫైనాన్స్ నిధులను దారిమళ్లించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ, స్టేట్ ఫైనాన్స్ నిధులు కూడా ఇవ్వలేదన్నారు. అర్బన్ డెవలప్‌మెంట్ (ఉడా) అథారిటీని తీసుకొచ్చి పంచాయతీలకు గుదిబండగా మార్చారని ఆవేదన చెందారు. గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేస్తున్న వెంచర్లలో ప్రభుత్వ అవసరాలకు ఒక ఎకరాకు 10 శాతం భూమి పంచాయతీకి కేటాయించాల్సి ఉందని కానీ ఉడా కారణంగా ఇది జరగడం లేదన్నారు. పంచాయతీ రిజల్యూషన్ లేకుండానే ఉడా అధికారులు ప్రైవేట్ వెంచర్లకు అనుమతులు ఇస్తున్నారన్నారు. అలాంటప్పుడు సర్పంచ్‌ల వ్యవస్థ ఎందకని ప్రశ్నించారు. ఉడా అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులతో లాలూచి పడి సర్పంచ్‌లకు తెలియకుండానే మీటింగ్‌లు ఏర్పాటుచేసుకుని వెళ్లిపోతున్నారన్నారు. 5 సెంట్ల ప్లాన్ అప్రూవల్‌కు పంచాయతీకి 14 శాతం కట్టేవారని ఉడా వచ్చిన తరువాత అలాంటిది జరగడం లేదన్నారు. ఇప్పటి వరకు తమ పంచాయతీలో కమర్షియల్‌కు రూ.73 లక్షలు, రెసిడెన్షియల్‌కు రూ.55 లక్షలు మొత్తం రూ.1.22 కోట్లు రావాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివచంద్రారెడ్డి పేర్కొన్నారు.

వైసీపీ ప్రభుత్వ ద్వంద్వ వైఖరితో..

పంచాయతీ రిజల్యూషన్ లేనిదే ఉడా ఏమి చేయకూడదన్నారు. తమ కొత్తపల్లె పంచాయతీలో 50 మంది సచివాలయ ఉద్యోగులు, 150 మంది వలంటీర్లు ఉన్నారని అయినా ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. తలసరి గ్రాంటు 30 సంవత్సరాల క్రితం రూ.4 ఉండేదని ఇప్పుడు కూడా అదే కంటిన్యూ అవుతోందని దీనిని రూ.100కు పెంచాలన్నారు. తమ కష్టాలు చెప్పుకోవడానికి కూడా గత వైసీపీ ప్రభుత్వం అవకాశం ఇచ్చేది కాదన్నారు. కనీసం స్ట్రీట్ లైట్లు కూడా కొనే అర్హతలేకుండా చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వ ద్వంద్వవైఖరి కారణంగా గ్రామాలలో ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేక అవమానంతో పలువురు సర్పంచ్‌లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి వచ్చిందన్నారు. గత వైసీపీ పాలనలో ఇక్కట్లు, అవమానాలు తప్ప ఎలాంటి అభివృద్ధి చేయలేకపోయామన్నారు. పూర్తిగా దెబ్బ తిని రోడ్డున పడ్డామన్నారు.



మాట్లాడుతున్న పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్

జీతాలు కూడా ఇవ్వలేని స్థితి

పోరుమామిళ్ల మేజర్ పంచాయతీలో తాను సర్పంచ్ అయ్యే సమయానికి రూ.1.50 కోట్లు నిధులు ఉండేవని సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టగానే ఆ నిధులను అప్పటి వైసీపీ ప్రభుత్వం తమకు తెలియకుండానే ఖర్చుచేసిందని సర్పంచ్ సుధాకర్ వాపోయారు. పైగా తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నాటికి 9 నెలల జీతాలు పెండింగ్‌లో ఉండేవన్నారు. ఒక నెలకు 3లక్షల 50వేలు ఖర్చువస్తోందన్నారు. ఇప్పుడు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి గత వైసీపీ పాలకులు తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యలు ప్రతి గ్రామ పంచాయతీలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలోని టీడీపీ పాలనలో గ్రామపంచాయతీలకు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సర్పంచ్‌ల గౌరవవేతనాన్ని రూ.10వేలకు పెంచుతామని సీఎం చంద్రబాబు చెప్పడం ఆనందంగా ఉందన్నారు. నూతనంగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వ పాలనలో గ్రామ పంచాయతీల ఆర్థిక వనరులను, సమస్యలను తెలుసుకొని పరిష్కార మార్గాలు చూపడానికి 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతినిధుల బృందాన్ని పంపి సర్పంచ్‌లతో సమీక్షించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం సెక్రటరీ రమణారెడ్డి, మెంబర్లు ప్రసాద్‌రావు, పద్మారావు, కృపారావు, డీపీవో ప్రభాకర్‌రెడ్డి, పరిపాలనాధికారి ఖాదర్‌బాషా, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మొండి బకాయిలు వసూలయ్యేనా?

జప్తు చేస్తామని వెళ్లిన అధికారులకు నేతల ఫోన్లు ● నోటీసులు ఇచ్చినా, కేసులు వేసినా బెదరని వైనం



పులివెందులలో పన్నులు చెల్లించని ఏపీఎన్జీఓ వాణిజ్య సముదాయం

పులివెందుల రూరల్, జూన్ 28: పులివెందుల మున్సిపాలిటీలోని మొండి బకాయిల వసూళ్లకు మున్సిపల్ అధికారులు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. మొండి బకాయిల వసూళ్లకు మున్సిపాలిటీ ప్రత్యేక కార్యక్రమం చేపట్టినా అనేక మంది పట్టించుకోలేదు. ప్రైవేటు ఆస్తుల పన్నులు వసూలు అవుతున్నప్పటికి ఓ ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన వాణిజ్య ఆస్తులకు పన్ను కట్టకపోవడం ఒకింత ఆశ్చర్యకరం.

పులివెందులలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఏపీఎన్జీఓ అసోసియేషన్‌కు సంబంధించిన కోట్ల విలువైన స్థలంలో రెండు అంతస్తుల్లో వాణిజ్య సముదాయం నిర్మించారు. వాటికి లక్షల రూపాయల అడ్వాన్స్‌ల రూపంలో తీసుకోవడంతో పాటు నెలనెలా రూ.10వేల నుంచి రూ.20వేల వరకు అద్దెలు వసూళ్లు చేస్తున్నారు. ఈ సముదాయానికి సంబంధించి దాదాపు ఎనిమిది లక్షల రూపాయల వరకు పన్నులు బకాయి ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. 13ఏళ్ల నుంచి పన్నుల వసూళ్ల కోసం నానా తంటాలు పడుతున్నా చెల్లించలేదని అంటున్నారు. ఆ సముదాయంలో ఎనిమిది వాణిజ్య గదులు, ఎస్బీఐ, ఫంక్షన్ హాల్ ఉన్నాయి. లక్షల రూపాయలు అడ్వాన్స్‌ల రూపంలో చెల్లించామని, నెలనెల అద్దెలు కూడా వసూలు చేస్తున్నారని అక్కడున్న వ్యాపారులు చెబుతున్నారు. అంటే నెలకు దాదాపు లక్ష నుంచి లక్షన్నర రూపాయల వరకు ఆదాయం వస్తుంది. అయితే.. ఏడాదికి ఒక్కసారి మాత్రమే మున్సిపాలిటీకి వేలల్లో చెల్లించాల్సిన పన్నులు మాత్రం ఎన్జీవో అసోసియేషన్ వారు కట్టడం లేదు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఉపయోగపడేందుకు పన్నులు వసూలు చేస్తున్నారని తెలిసినా సాటి ప్రభుత్వ ఉద్యోగులే ఇలా పన్నులు చెల్లించకపోవడం ఏమిటని పలువురు అధికారులే ప్రశ్నిస్తున్నారు. పన్ను కట్టాల్సిన అవసరం లేదని ప్రభుత్వం జీఓ ఇచ్చిందని ఎన్జీఓ నేతలు అంటున్నారు. అయితే ఆ జీఓలో ఏముందనేది ఇప్పటి వరకు తెలియదని మున్సిపల్ అధికారులు అంటున్నారు. భారీగా ఆదాయం సమకూరుతున్న వాణిజ్య సముదాయానికి పన్ను వసూలు చేయవద్దని ఏ ప్రభుత్వం చెప్పదు అనేది అధికారుల మాట.

జప్తు చేసేందుకు వెళ్లారు, వెనక్కితగ్గారు

ఇక్కడి గదులు ఉద్యోగులకే ఉపయోగిస్తున్నారా, లక్షల్లో ఆదాయం ఆర్జిస్తున్నారు కదా పన్ను కట్టమంటే ఎందుకు కట్టడం లేదని అప్పటి కమిషనర్ నరసింహారెడ్డి ఎన్జీఓ సంఘనేతలను ప్రశ్నించారు. ఆస్తులు జప్తు చేస్తామని హెచ్చరించారు. అన్ని ఏర్పాట్లు చేసుకొని తీరా నోటీసులు ఇచ్చే సమయానికి వైసీపీ పెద్దల నుంచి ఫోన్లు రావడంతో వెనక్కి తగ్గారు. నామమాత్రంగా నోటీసులు ఇచ్చి వెళ్లిపోయారు. కాగా ఎన్జీఓ సంఘానికి ప్రభుత్వం ప్రత్యేకంగా పర్మిషన్ ఇచ్చిందని జీఓ ఇచ్చిందని, పన్ను కట్టాల్సిన అవసరం లేదని ఆ సంఘనేతలు అంటున్నారని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే ఇంతవరకు తమకు ఆ జీఓ చూపలేదని చెబుతున్నారు.

కేసు పెట్టాం

- రఘు, రెవెన్యూ అధికారి, పులివెందుల మున్సిపాలిటీ

ఎన్జీఓ సముదాయానికి సంబంధించి పన్ను వసూలుకు పలుమార్లు నోటీసులు ఇచ్చాం. దాదాపు రూ.8లక్షలు బకాయి ఉంది. పన్ను వసూలుకు కేసు వేశాం. ప్రస్తుతం కేసు కోర్టులో ఉంది.

వీరభద్రస్వామి హుండీల ఆదాయం రూ.22 లక్షలు



రాయచోటిటౌన్, జూన్28: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవ స్థానంలో హుండీల ఆదాయం రూ.22 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి తెలియజేశారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు హుండీల లెక్కింపు జరిగింది. 90 రోజులకు ఆలయాల హుండీల ఆదాయం రూ.21 లక్ష 35 వేల 855లు రాగా, 35 గ్రాముల 600 మిల్లీ గ్రాముల బంగారం, ఒక కేజీ 857 గ్రాముల వెండి, అన్నదానం హుండీ ద్వారా రూ.1 లక్ష 4 వేల 290లు ఆదాయం వచ్చినట్లు ఆయన తెలియజేశారు.

ఎస్బీఐని సందర్శించిన డీజీఎం



అధికారులతో మాట్లాడుతున్న డీజీఎం దినేష్ గులాటి

కడప (నాగరాజుపేట), జూన్ 28 : నగరంలోని ప్రధాన భారతీయ స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని కర్నూలు, కడప, అనంతపురం ఉమ్మడి జిల్లాల కర్నూలు జోన్ ప్రత్యేక అధికారి డిప్యూటీ జనరల్ మేనేజరు దినేష్ గులాటి శుక్రవారం సందర్శించారు. ఆయనకు బ్యాంకు చీఫ్ మేనేజరు మధుసూదన్‌రావు స్వాగతం పలికారు. అనంతరం ఆయన బ్యాంకు అధికారులతో సమీక్షించారు. అనంతరం ఖాతాదారులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మేనేజరు మధుసూదన్‌రావు, మేనేజరు శశిధర్, సీనియర్ క్లర్క్ సంధ్యారాణి, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల్లో చిగురిస్తున్న ఆశలు

● కొత్త ప్రభుత్వం కొలువుదీరడంతో.. ● బతుకులు బాగుపడతాయనే భరోసాలో ఉద్యోగులు

అది ఘనత వహించిన ఏపీఎస్‌ఆర్టీసీ. రాత్రి, పగలూ అనే తేడా లేకుండా నిత్యం లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 54 వేల మంది వివిధ స్థాయి కార్మికులు, ఉద్యోగులు సేవలందిస్తున్నారు. వీరి ఆశలపై నీళ్లు చల్లేలా గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలన సాగింది. 2020 జనవరి 1న ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిందే కానీ వారికి ఇతర ప్రభుత్వ ఉద్యోగులతో సమానమైన సదుపాయాలు కల్పించకుండా చేతులెత్తేసింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల ముఖాలలో చిరునవ్వు మాయమైంది.



కడప (మారుతీనగర్), జూన్ 28: ప్రధానంగా ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనమైతే ప్రభుత్వ ఉద్యోగుల వలే పెన్షన్ వస్తుందనే ఆశ నీరుగారిపోయేలా చేయడంతో ఉద్యోగులంతా ఒక రకమైన మానసిక అశాంతికి గురయ్యారు. పెన్షన్ ఇవ్వకపోగా.. విలీనం కాకముందు ఆర్టీసీ ఉద్యోగులకు వచ్చే స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ స్కీమ్ ద్వారా అందే చిన్నపాటి పెన్షన్ కూడా ఇవ్వకుండా పీకేశారు. పైపెచ్చు ఉద్యోగుల జీతాల నుంచి పెన్షన్ స్కీంకు మినహాయించిన డబ్బులు కూడా ఇంకా కొంత మంది ఉద్యోగులకు చెల్లించలేదనే ఆరోపణలున్నాయి. దీంతో పాటుగా స్టాఫ్ రిటైర్‌మెంట్ బెనిఫిట్ ట్రస్ట్ (ఎస్బీటీ) సదుపాయాన్నికూడా ఉద్యోగులకు చెల్లించకుండా తొలగించింది. అంతటితో ఆగకుండా ఉద్యోగులు మాకొద్దు అని మొత్తుకున్నా ఎంప్లాయిస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్) కార్డులను బలవంతంగా వైసీపీ ప్రభుత్వం అంటగట్టి, ఉద్యోగుల స్థాయిని బట్టి ప్రతీనెలా వారికొచ్చే జీతంలో రూ..250 నుంచి రూ.600 వరకూ కోత విధిస్తూ వచ్చింది. అందుకు తగ్గ ఆరోగ్యసేవలను అందించడంలో విఫలమైంది. పైపెచ్చు గతంలో ఉద్యోగులకు అందే వైద్యసేవలను రద్దు చేసింది. దీంతో ఆర్టీసీలో వైద్యసేవలందక.. ప్రభుత్వ వైద్యశాలల్లో సరైన వైద్యసేవలందక వీరు ఇబ్బంది పడ్డారు. విలీనం కాకముందు ఉద్యోగులకు అన్‌లిమిటెడ్ వైద్యసదుపాయాలందేవి. ఏదేని అనారోగ్య సమస్యలకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్‌లో అందే వైద్యసేవలకు కూడా గత వైసీపీ ప్రభుత్వం మంగళం పలకడంతో స్వంత డబ్బులతో వైద్యసేవలు పొందాల్సిన దుస్థితి తలెత్తిందని పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు అన్యాయం

ఆర్టీసీలో విధులు నిర్వహించి రిటైర్డ్ అయిన ఉద్యోగులు సైతం తీవ్ర అన్యాయానికి గురయ్యారు. విలీనానికి ముందు ఆర్టీసీ ఉద్యోగులు రిటైర్‌మెంట్ కాగానే వారికొచ్చే బెనిఫిట్స్ నుంచి రూ.25వేలను సంస్థకు కట్టేవారు. లైఫ్ లాంగ్ రిటైర్డ్ ఉద్యోగితో పాటుగా ఆయన భార్యకు కూడా ఏదేని ఆరోగ్యసమస్యలకు వీలుగా ప్రతీనెలా సంబంధిత ఆర్టీసీ ఆసుపత్రిలో ఉచితంగా మందులు అందేవి. అంతేకాకుండా సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సుమారు రూ.4 లక్షల వరకూ సంస్థ భరించేది. కాగా ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అయిన తర్వాత ఈహెచ్‌ఎస్ కార్డు ఉందనే నెపంతో రిటైర్‌మెంట్ మెడికల్ స్కీం (ఆర్ఎంఎస్)ను వైసీపీ ప్రభుత్వం తొలగించింది. దీని కారణంగా రిటైర్ అయిన తర్వాత ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ కార్డులు పనిచేయకపోవడంతో తీవ్ర నరకయాతనకు గురౌతున్నారు. అదే ప్రభుత్వ ఉద్యోగికి రిటైర్ అయిన తర్వాత పెన్షన్ వస్తుంది కాబట్టి వారికి ఈహెచ్‌ఎస్ కార్డుల తాలూకు వైద్యసేవలు అందుతున్నాయి. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగికి పెన్షన్ రాని కారణంగా ఈహెచ్‌ఎస్ కార్డు తాలూకు వైద్యసేవలందడం లేదు.

కొత్త ప్రభుత్వంపై చిగురిస్తున్న ఆశలు

గత వైసీపీ ప్రభుత్వ పాలనపై ఆర్టీసీ ఉద్యోగులు పెట్టుకున్న ఆశలు పూర్తిగా అడుగంటిపోయాయి. ప్రస్తుతం కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంతో తమకు మేలు జరుగుతుందనే ఆశలు ఆర్టీసీ ఉద్యోగుల్లో చిగురిస్తున్నట్లుగా చెప్పుకుంటున్నారు. ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడిన వైసీపీ ప్రభుత్వం ఇటీవల జరిగిన ఎన్నికలలో ఘోర ఓటమి చవిచూడడంతో ఆర్టీసీ ఉద్యోగులు సైతం హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కాగా గాడి తప్పిన ఆర్టీసీని తిరిగి గాడిలో ఉంచగల సత్తా ముఖ్యమంత్రి చంద్రబాబుకు మాత్రమే ఉందనే విశ్వాసంతో ఉద్యోగులున్నారు. ఇటు ఆర్టీసీ మనుగడతో పాటు తమ బతుకుల బాగుపడతాయని వీరు ఆశిస్తున్నారు.

పెన్షన్ కోసం ఆశగా..

కడప రీజియన్ పరిధిలో కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఆర్టీసీ డిపోలు ఉన్నాయి. వీటిలో డ్రైవర్లు, కండక్టర్లు 1696 మంది పనిచేస్తున్నారు. వీరిలో 866 మంది కండక్టర్లు, 830 మంది డ్రైవర్లు ఉన్నారు. వీరితో పాటు మిగ తా ఆర్టీసీ ఉద్యోగులం దరూ ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా తమకు పెన్షన్ అందు తుందని ఆశగా ఎదురుచూస్తున్నారు.



మంత్రి లోకేశ్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే శంకర్



మదనపల్లె, జూన్ 28: తంబళ్లపల్లె మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్, మంత్రి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ అధినేత, సీఎం నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ కార్యాలయానికి వెళ్లిన జి.శంకర్‌యాదవ్..యువనేతను కలిశారు. ఈసందర్భంగా తంబళ్లపల్లె నియో జకవర్గ పరిస్థితిని ఆరా తీసిన మంత్రి లోకేశ్ మూడురోజుల తర్వాత మరోసారి రావాలని అప్పుడు నియోజకవర్గ రాజకీయ పరిస్థితులు, సమస్యలపై చర్చిద్దామని సూచించినట్లు తెలిపారు.

మంత్రి మండిపల్లిని కలసిన టీడీపీ నేతలు



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీనేత మొటుకు శివ, తదితరులు

మదనపల్లె, జూన్ 28: తంబళ్లపల్లెకు చెందిన టీడీపీ నేతలు రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి మొటుకు శివ ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డిని కలిశారు. బి.కొత్తకోట మండలం గట్టు గ్రామానికి చెందిన నేతలు చిన్నమండ్యం మండలంలోని స్వగ్రామంలో కలసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలు వివరించారు. అలాగే గతంలో తాము చేపట్టిన పనులకు బిల్లులు రావాలని మొటుకు శివ.. మంత్రి దృష్టికి తీసుకురాగా, మరోసారి సమావేశమై చర్చించి, పరిష్కారిస్తామని మండిపల్లె హామీ ఇచ్చారు. మంత్రిని కలసిన వారిలో గట్టు గ్రామ కమిటీ అధ్యక్షుడు రెడ్డెన్న, మల్లికార్జున, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కిరణ్‌ను కలిసిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్



బెంగళూరులోని కెంపేగౌడ విమానాశ్రయంలో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని కలసి పుష్పగుచ్ఛం అందిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

పెద్దతిప్పసముద్రం జూన్ 28 : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గసభ్యుడు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని శుక్రవారం బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. ఆయన 4 రోజుల పర్యటన నిమిత్తం హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో బెంగళూరుకు చేరుకున్నారు. అనంతరం ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరి సాయంత్రం 6 గంటలకు కలికిరి చేరుకుంటారన్నారు. కలికిరిలో పార్టీ కార్యాలయంలో జూలై 3వ తేది వరకు అందుబాటులో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనాథ్‌రెడ్డి తనయుడు మనోజ్‌జయంత్‌రెడ్డి ఉన్నారు.

పీలేరు పంచాయతీ కార్యదర్శిగా గురుమోహన్ బాధ్యతలు స్వీకరణ

పీలేరు, జూన్ 28: పీలేరు గ్రామ పంచాయతీ కార్యదర్శిగా వై.గురుమోహన్ బాధ్యతలు స్వీకరించారు. కలికిరి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయనకు పీలేరు పంచాయతీ కార్యదర్శిగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి ఆదేశాలు జారీ చేయడంతో ఆయన ఈ మేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. పీలేరు పంచాయతీ ఇన్‌ఛార్జ్ కార్యదర్శిగా ఉన్న ఎస్.ఎ.గఫూర్ ఇటీవలి కాలంలో పీలేరు పంచాయతీ సర్పంచుల మధ్య ఏర్పడిన ఆధిపత్య పోరు కారణంగా దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోవడంతో ఆయన స్థానంలో గురుమోహన్ నియమితులయ్యారు.

అతిసారంపై అప్రమత్తంగా ఉండాలి

తంబళ్లపల్లె, జూన్ 28: వర్షాలు కురుస్తున్న తరుణంలో అతిసార ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి వెంకట్రామయ్య సూచించారు. జిల్లా కలెక్టర్, వైద్యఆరోగ్య శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ఆసుపత్రిలో అతిసారకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేసి మందులను అందుబాటులో ఉంచారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ..సురక్షితమైన మంచినీరు మాత్రమే తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనానాకి ముందు తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

పీలేరు, జూన్ 28: పీలేరు పట్టణంలోని పలు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను శుక్రవారం వ్యవసాయ శాఖ విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. మదనపల్లె డివిజన్ ఏడీ శివశంకర్ నేతృత్వంలో జరిగిన ఈ తనిఖీల్లో ఆయా దుకాణాల్లోని ఇన్‌వాయిస్‌లు, రిజిష్టర్లు పరిశీలించి విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులను ఎంఆర్‌పీకే విక్రయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఏవో రమాదేవి, ఏఈవో నజీర్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి సహకారంతో ముందుకెళ్దాం

● కేవీపల్లెలో అధికారులతో ఎమ్మెల్యే కిశోర్ కుమార్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు/కలకడ, జూన్ 28: ప్రజలు మనపై ఉంచిన అంచనాలు, ఆకాంక్షలను నెరవేర్చడానికి అందరం సమష్టిగా ముందుకెళ్దామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులను కోరారు. 'దౌర్జన్యాలు, అరాచకా లు, భూఆక్రమణలు, మితిమీరిన రాజకీయ జోక్యం వంటి అంశాలతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం మమ్మల్ని గెలిపించారు. వారి ఆకాంక్షల మేరకు మాపై భారీ అంచనాలున్నాయి. వాటిని అందుకోవడా నికి మీ సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే హోదా లో తొలిసారిగా ఆయన శనివారం కేవీపల్లె మండల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గత ప్రభుత్వంలో మితిమీరిన రాజకీయ జోక్యంతో కళ్ల ముందు అనేక అన్యాయాలు, ఆక్రమణలు జరుగుతున్నా అధికారులు నిస్సహా యులుగా మిగిలిపోయిన వైనం తనకు తెలుసునన్నారు. తమ ప్రభు త్వంలో అటువంటి పనులు ఉండబోవని స్పష్టం చేశారు. పూర్తి పారద ర్శకతతో వ్యవహరిస్తూ సంక్షేమ పథకాలను పేదలకు అందిచ్చేందుకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వంలో వేలాది మంది అనర్హులు తప్పు డు ధృవీకరణ పత్రాలతో వివిధ సంక్షేమ పథకాలను అందుకున్నారని, అటువంటి వారిని ఏరివేయాలన్నారు. కేవీపల్లెలో ఆర్‌ఐ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని అమ్ముకున్న వారిని గుర్తించి వారిపై క్రిమినల్ చర్యలు చేపటాలని ఆదేశించారు. పీలేరు నియోజకవర్గాన్ని ఆదర్శ నియోజకవర్గంగా నిలిపేందుకు తనకు సహకరించాలన్నారు. అనంతరం వివిధ పథకాల తాజా సమాచారాన్ని అధికారుల నుంచి సేకరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదవేంద్ర, తహసీ ల్దారు నవాజ్ అహ్మద్, ఎస్‌ఐ రహీముల్లా, టీడీపీ నేతలు తిమ్మాపురం రఘురామిరెడ్డి, సుధా కర్ నాయుడు, గీతాంజలి, వగళ్ల చిన్నా, రెడ్డప్ప రెడ్డి, సీవీ రావు, ఎంజీవీ రమణ, కండక్టర్ రమణ, వెంకటరత్నం, శివారెడ్డి, సూర్యప్రకాశ్ రెడ్డి, ఎర్రమరెడ్డి, సురేశ్‌రెడ్డి, రమణారెడ్డి, రెడ్డప్ప, చంద్ర, బాబురెడ్డి, గంగా ధర, నాగేశ్వర, అన్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో గ్రామాలు అభివృద్ధి

అందరి సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కలకడ టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల పోరాటం తరువాత ప్రజాసేవ చేసేందుకు తనను ఎమ్మెల్యేగా గెలిపించన అందరికీ రుణపడి ఉంటానన్నారు. రాజకీయాలో పదవులు శాశ్వతం కాదని, కక్ష సాధింపులు లేకుండా పాలన సాగించడం తమ అభిమతమన్నారు. అంతకుమునుపు ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టి మొదటి సారిగా పట్ట ణానికి వచ్చిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు మద్దిపట్ల వెంకట్రామ య్యచౌదరి, రవిప్రకాశ్‌నాయుడు, మద్దిపట్ల సూర్యప్రకాశ్, పొత్తూరి ప్రభాకర్‌నాయుడు, బరకం శ్రీనివాసులరెడ్డి, నాగరాజునాయుడు, కాంతారావు, మల్లికార్జుననాయుడు, కోనేని ఆనంద్‌నాయుడు, విశ్వనాథ్, రైస్‌మిల్ రమణ, చంద్రమోహన్, షబ్బీర్ అహ్మద్, మునాప్, జిలానీ, ఇనాయతుల్లా, నౌషాద్, ఇర్ఫాన్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

అడ్డగోలు పనులకు దూరంగా ఉండాలి

ప్రభుత్వ పథకాలకు సంబంధించి అడ్డగోలు పనులకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి చొరవచూపాలన్నారు. ఉపాధిహామి పథకంలో పనులు చేయకుండా బిల్లులు, పాత పనులకు బిల్లులు చెల్లిస్తే సహించేది లేదన్నారు. ఎలాంటి అంతరాయం లేకుండా ఝరి కోన పైప్‌లైన్ ద్వారా గ్రామాల కు తాగు నీటిని అందజేయాలన్నారు. అనర్హులకు పింఛన్ల చెల్లింపు విచారణ జరిపి అర్హులకు న్యాయం చేయాలన్నారు. చెరువులో ఆక్రమ ణలను గుర్తించడంతోపాటు అనుమతులు లేకుండా వెలసిన అక్రమ లే అవుట్లపై నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా అధికారులు ఎమ్మెల్యేకి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం విద్యార్థులకు స్టూడెంట్ కిట్స్‌ను పంపిణీ చేశారు. కాగా ఏపీ గురుకుల పాఠశాలల్లో గత ప్రభుత్వంలో తొలగించబడ్డ మ్యాన్ పవర్ ఉద్యోగులు తమకు న్యాయం చేయాలని వినతి పత్రం అందజేశారు.

భర్తే కాలయముడై..భార్యను కడతేర్చాడు

●కన్న బిడ్డలకోసం వచ్చి భర్త చేతిలో బలైన భార్య

నిమ్మనపల్లి, జూన్ 28: నిమ్మనపల్లి మండలం రెడ్డివారిపల్లి పంచాయతి దివిటివారిపల్లి సమీపంలో భర్తే కాలయముడై భార్యను హతమార్చాడు. దీనికి సంబంధించి చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం కార్తికేయ పురంలో నివాసం ఉంటున్న సాలమ్మ, రంగయ్యల కుమార్తె భారతి(22)కి పలమనేరుకు చెందిన గణపతితో 4ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. కాగా భార్యపై అనుమానంతో భర్త నిత్యం వేధింపులకు గురి చేస్తుండడంతో తట్టుకోలేక కొంతకాలం భర్తకు దూరంగా ఉంటున్న భారతి నెల్లూరు జిల్లా కొవ్వూరుకు చెందిన రవిని వివాహం చేసుకొంది. దీంతో మొదటి భర్త గణపతి మరొక మహిళను వివాహం చేసుకొని తన మొదటి భారతి పిలల్లతో వేరుగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తన సంసారానికి పిల్లలు అడ్డుగా ఉన్నారని రెండవ భార్య గణపతిని కోరింది. దీంతో మొదటి భార్య భారతికి ఫోన్ చేసి పిల్లలను చూసేందుకు రావాలని కోరగా గురువారం భారతి రాగానే ఇద్దరు కలిసి నిమ్మనపల్లె మండలం రెడ్డివారిపల్లె పంచాయతి దివిటివారిపల్లె మామిళ్లగుట్ట సమీపంలోని పొలం వద్ద వున్న గుడిసె వద్దకు వెళ్లారు. దివిటివారిపల్లెకు చెందిన బాలె రామాంజులు పంటపొలానికి నీరు కట్టేందుకు పొలం వద్దకు వచ్చాడు. గుడిసెలో శబ్దాలు వస్తుండడంతో రామాంజులు పరుగున రావడంతో అప్పటికే భార్య భారతీని హతమార్చి కోపోద్వేగంలో గణపతి రామాంజులుపై కత్తితో గొంతుపై కోసి అక్కడినుంచి పరారయ్యాడు. గమనించిన గ్రామస్థులు రామాంజులును మదనపల్లె ఆసుపత్రికి తరలించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, సీఐలు సద్గురుడు, వలీవను, యువరాజ్ ఎస్‌ఐలు మల్లిఖార్జునరెడ్డి చంద్రశేఖర్ అన్నమయ్య జిల్లా క్లూస్‌టీమ్ ఎస్‌ఐ రవీంద్రారెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలాన్ని పరిశీలించి సెల్‌ఫోన్ ఆధారంగా హతురాలి వివరాలను సేకరిం చామన్నారు. నిందుతుని కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

సంపత్ హత్య కేసును సీబీఐకి అప్పగించాలి

పీలేరు, జూన్ 28: అనంతపురం జిల్లాకు చెందిన ఎస్ఎస్‌యూఐ నేత, యువ న్యాయవాది బిర్రు సంపత్ హత్య కేసును సీబీఐకి అప్పగించాలని పీలేరులోని పలు యువజన, విద్యార్థి, ప్రజాసంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంపత్ హత్య జరిగి నెలరోజులవుతున్నా ఆయన కేసులో ఎటువంటి పురోగతి లేకపోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం రాత్రి పీలేరులోని అంబేడ్కర్ విగ్రహం ముందు వారు కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమృత తేజ మాట్లాడుతూ సంపత్ కుటుంబానికి న్యాయం జరగాలంటే ఆయన హత్య కేసును సీబీఐకి అప్పగించాలన్నారు. అంతే కాకుండా ఆయన కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

కొత్త ఎమ్మెల్యేకు సమస్యల స్వాగతం

పీలేరు, జూన్ 28: ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా శనివారం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరుకు రానుండడంతో అపరిష్కృత సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. వాటిలో భూఆక్రమణలు ప్రథమ స్థానంలో ఉండగా మండలంలో కుంటుపడిన పరిపాలన ద్వితీయ స్థానంలో ఉన్నాయి. ప్రతిపక్షంలో ఉండగా వాటిపై నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి అలుపెరుగని పోరాటం చేశారు. ఆయన పోరాటాన్ని మెచ్చి పీలేరు నియోజకవర్గ ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించారు.

నేడు పీలేరులో నల్లారి పర్యటన

ఎమ్మెల్యేగా తొలిసారి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి శనివారం పీలేరులో పర్యటించనున్నారు. ఉదయం 9.30 గంటలకు స్థానిక ఏఎంసీ ప్రాంగణంలో కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఆ తరువాత మధ్యాహ్నం 3.30 గంటలకు మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. తమ అభిమాన నేతకు ఘనస్వాగతం పలికేందుకు పీలేరు మండల టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.

ఎమ్మెల్యే షాజహాన్‌కు సన్మానం

మదనపల్లె అర్బన్, జూన్28: స్థానిక జీఆర్టీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మదనపల్లె రిటైర్డు ఉద్యోగసంఘం నాయకులు ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు బీవీరమణ, కార్యదర్శి కోదండరామయ్య, కోశాధికారి వెంకట్రాయప్ప పాల్గొన్నారు. కాగా స్థానిక బ్రాహ్మణ సంఘం వారు పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఆక్రమిత భూములను వెనక్కి తీసుకోవాలి

మదనపల్లె అర్బన్, జూన్ 28: మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల్లో వేల కోట్లు విలువ చేసే భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్న వాటిని వెనక్కి తీసుకోవాలని వీసీకే పార్టీ నేత పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కొందరు ప్రభుత్వ భూములను లేఅవుట్లు వేసి విక్రయాలు జరిపారన్నారు. దీనిపై సమగ్ర సమాచారంతో త్వరలోనే కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తామన్నారు.

1న ఉచిత వైద్య శిబిరం

తంబళ్లపల్లె, జూన్ 28: తంబళ్లపల్లె మండల కేంద్రంలోని పాత కళాశాల మైదానంలో జూలై 1న మదనపల్లె శ్రీ వెంకటేశ్వర హార్ట్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి వైద్యుడు ఎస్‌టీ .కిషోర్ తెలిపారు. వైద్య శిబిరంలో గుండె జబ్బులు, బీపీ, మధుమేహం, తదితర సమస్యలకు ఉచిత పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామన్నారు.

దిష్టిబొమ్మలపై కదిలిన యంత్రాంగం

● సర్వేయర్లతో జిల్లా అధికారి సమావేశం

● పూడ్చేస్తారో..ఏం చేస్తారో ఏదో చేయండి



వలసపల్లె గ్రానైట్ ఫ్యాక్టరీలో సర్వే రాళ్లపై విచారణ చేపడుతున్న ఆర్ఐ రెడ్డెప్ప, వీఆర్వో శ్రీనివాసులు

మదనపల్లె, జూన్ 28: జగనన్న భూరక్ష-2020 పథకంలో భూములు రీసర్వే చేసి హద్దుల్లో నాటాల్సిన సరిహద్దు రాళ్ల స్థితిగతులపై అంచనా వేయడానికి జిల్లా యంత్రాంగం ఆగమేఘాల మీద కదిలింది. వృథాగా భూసర్వే రాళ్లు, గ్రానైట్‌ఫ్యాక్టరీలు, గ్రామాల్లో గుట్టలు, ప్లాంటేషన్ సొమ్ములు స్వాహాను వివరిస్తూ దిష్టిబొమ్మల్లా..! అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవారం కథనం వెలువడింది. దీనికి స్పందించిన కలెక్టర్ అభిషిక్త్ కిశోర్..జిల్లా సర్వే అధికారి జయరాజ్‌తోపాటు ఆయా ఆర్డీవోలను ఆదేశించారు. ఈ క్రమంలో మదనపల్లె ఆర్డీవో హరిప్రసాద్..మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని తహసీల్దార్లు, మండల సర్వేయర్లను అప్రమత్తం చేశారు. రీ సర్వే చేపట్టిన గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. మరోవైపు మదనపల్లె, తంబళ్లపల్లె డివిజన్ స్థాయిసర్వే అధికారులతోపాటు మండల సర్వేయర్లు, గ్రామసచివాలయ సర్వేయర్లతో శుక్రవారం జిల్లా కేంద్రం రాయచోటిలో సమావేశమైన ఏడీ జయరాజ్..మండలాల వారీగా సర్వే అయిన గ్రామాలు ఎన్ని? వాటికి వచ్చిన సర్వేరాళ్లు..క్షేత్ర స్థాయిలో నాటిన రాళ్లపై నివేదిక ఇవ్వాలని సూచించారు. ఇదిలావుండగా, మదనపల్లె ఆర్డీవో ఆదేశాల మేరకు తహసీల్దార్ రమాదేవి గ్రానైట్ ఫ్యాక్టరీలో మిగిలిన రాళ్లను అంచనా వేసేందుకు సిబ్బందిని పంపించారు. ఈక్రమంలో ఆర్ఐ రెడ్డెప్ప, వలసపల్లె వీఆర్వో శ్రీనివాసులు. శుక్రవారం వలసపల్లె గ్రానైట్ ఫ్యాక్టరీకి వెళ్లి అక్కడ ఏఏ ఫ్యాక్టరీలలో ఎన్నెన్ని రాళ్లు నిరుప యోగంగా ఉన్నాయో లెక్కించి తహసీల్దార్‌కు నివేదిక ఇచ్చారు. అయిదు ఫ్యాక్టరీలలో ఇంకా 4,575 రాళ్లు మిగిలిపోయాయని, వాటికి ప్రభుత్వం యజమానులకు డబ్బులు చెల్లించలేదని తెలిపారు. అలాగే మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం, పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు, బి.కొత్తకోట, పీటీఎం, కురబలకోట మండలాల్లో గ్రామ సర్వేయర్లు క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. పూర్తిస్థాయి వివరాలు శనివారం సాయంత్రానికి ఇవ్వాలని ఆదేశించినట్లు ఆర్డీవో పేర్కొన్నారు.

స్వాహా రాయుళ్ల గుండెల్లో రైళ్లు

మదనపల్లె డివిజన్‌లో రీసర్వేకు ఎంపికైన గ్రామాల్లో కొందరు సర్వే అధికారులు సొమ్ములు స్వాహా చేసినట్లు తెలిసింది. సర్వే కూడా పూర్తి కాకుండానే స్టోన్ ప్లాంటేషన్ పూర్తయిందని, అందకు విడుదలైన నిధులు ఖర్చు చేసినట్లు ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చారు. అయితే రీ సర్వే స్థితిగతులు, స్టోన్ ప్లాంటేషన్‌పై కథనం రావడంతో వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

ఉపాధ్యాయులకు సన్మానం

బి.కొత్తకోట, జూన్28: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయ బృంధాన్ని బి.కొత్తకోటకు చెందిన మానవత సంస్థ ప్రతినిధులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థిని తమన్నా ఈ ఏడాది పదో తరగతి పరీక్షలలో 594 మార్కులు సాధించి అన్నమయ్య జిల్లాలో ఫస్ట్‌ర్యాంకు, రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు సాధించింది. అప్పట్లో ఇది సంచలనం అయింది. ఈ నేపథ్యంలో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించే విధంగా విద్యాబోధన చేసిన పాఠశాల ఉపాధ్యాయ బృంధానికి అభినందనలు తెలియజేస్తూ మానవతసంస్థ ప్రతినిధులు సత్కరించుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్కిల్‌ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్, మానవత ప్రతినిధులు క్రిష్టారెడ్డి, రామచంద్రారెడ్డి, ఆదిత్యప్రసాద్, వెంకటరెడ్డి, రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎం వర్కర్స్ నూతన కార్యవర్గం

మదనపల్లె టౌన్, జూన్ 28: మదనపల్లె స్పిన్నింగ్ మిల్లు వర్కర్స్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు అధ్యక్షుడు ఎస్.నందగోపాల్ తెలిపారు. మొత్తం 311 మంది కార్మికులకు గాను 207 మంది కార్మికులు వచ్చి ఏకగ్రీవంగా కొత్త కార్యవర్గానికి మద్దతు ప్రకటించారన్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడుగా ఎస్.నందగోపాల్ సలహాదారుడుగా వి.సదాశివారెడ్డి, ఉపాధ్యక్షుడుగా ఎం.కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జి.భాస్కర్‌రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, శివమల్లప్ప నాయుడు, మునిరత్నం, భాస్కర్‌రెడ్డి, కోశాధికారిగా కె.రవిచంద్రను ఎంపిక చేశామన్నారు.

ఘనంగా జాతీయ వృక్ష దినోత్సం

మదనపల్లె, జూన్ 28: జాతీయ వృక్ష దినోత్సవాన్ని పురష్కరించుకుని మదనపల్లె లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అటవీ ప్రాంతంలో సీడ్స్‌బాల్స్ చల్లారు. మదనపల్లె మండలం పెంచుపాడు జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాల విద్యార్థులు, లయన్స్‌క్లబ్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెంచుపాడు అటవీ ప్రాంతంలో రాగి, చింత, వేప, కానుగ, తదితర అటవీ వృక్ష జాతులకు సంబంధించిన పదివేల చెట్ల విత్తనాలను చల్లారు.

ఇళ్ల స్థలాలు కబ్జా చేసిన వారిని వదలొద్దు

● ప్రభుత్వ భూములను కాపాడాలి ● ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ఇళ్లస్థలాల విషయమై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, జూన్ 28: బీకే పల్లె కాలనీలో ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను కబ్జా చేసిన వారిని ఎట్టి పరిస్థితిలోను వదలొద్దని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. శుక్రవారం పట్టణ శివారులోని బైపాస్ రోడ్డు పక్కన ఉన్న బీకే పల్లె కాలనీలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం తాను ఎమ్మెల్యేగా ఉన్న 2009-14మధ్య మండలంలో పలుచోట్ల ఇళ్ల స్థలాలు కేటాయించామన్నారు. కొందరు ఆర్థిక పరిస్థితులు సరిగ్గా లేక పునాదులు కూడా వేయలేదని ఇదే అదునుగా చేసుకుని ఈ ఐదేళ్లలో కొంత మంది బీకేపల్లె, కోళ్లబైలు, వలసపల్లె కాలనీల్లో ఖాళీగా వున్న ఇళ్ల స్థలాలను కబ్జా చేసి, పునాదులు నిర్మించి ఇతరులకు విక్రయించినట్లు తెలిసిందన్నారు. వాటన్నింటిపై విచారించి తనకు నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ రమాదేవిని ఆదేశించారు. హౌసింగ్ కింద ఎవరెవరికి బిల్లులు అయ్యాయో తెలపాలని ఏఈ దీనదయాళ్‌రాజుకు సూచించారు. అనంతరం సీటీఎం రోడ్డు గోవర్ధన్‌నగర్‌కు వెళ్లిన షాజహాన్‌బాషాకు అక్కడి మహిళలు పలుసమస్యలు ఏకరువుపెట్టారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని కొత్తిండ్లు ప్రాథమిక పాఠశాలలో ఓ దాత అందజేసిన నోటుపుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా విద్యార్థులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

బీకే పల్లెలోని 22 లేఅవుట్లలో అక్రమాలపై చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమాదేవి

మదనపల్లె అర్బన్, జూన్ 28: మదనపల్లె పట్టణ సమీపంలోని బీకే పల్లెలో 2006, 2007లో ప్రభుత్వం వేసిన 22 లేఅవుట్లల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశాల మేరకు బీకే పల్లెలోని 22 లేవుట్లో అక్రమాలను గుర్తించడానికి, సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు 22 టీంలను ఏర్పాటు చేసుకుని అందులో వీఆర్వో, సర్వేయర్, ప్లానింగ్ అధికారి, ఇంజనీరింగ్ సెక్షన్ అడ్మిన్‌తో కూడిన టీం సర్వే నిర్వహించడానికి సిద్ధం చేశామన్నారు. మొత్తం 4842 ఇళ్ల పట్టాలు 22 లేఅవుట్లు ఉన్నాయని, అందులో 1000 ఇళ్ల పూర్తి కాగా, 3000 స్థలాల్లో లబ్ధిదారులు బేస్ మట్టం నిర్మాణాలు చేపట్టగా 842 ఖాళీస్థలాలు ఉన్నాయన్నారు. ఇందులో కొందరు మధ్యవర్తులుగా ఉంటూ నిరుపేదలకు నకిలీ పత్రాలు సృష్టించి అమ్మెశారని తెలిపారు. ఇలాంటి అక్రమదారుల నుంచి కొనుగోలు చేసిన ఇళ్ల నిర్మాణాలను తొలగించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ దీనదయాల్‌రాజు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం కలిసి కట్టుగా పనిచేయాలి



మాట్లాడుతున్న రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్

కురబలకోట, జూన్ 28: సమష్టి కృషితో అభివృద్ధిని సాధిద్దామని రాజంపేట పార్ల మెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్ర యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కురబలకోట స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం వచ్చే నెల 1న పంపిణీ చేస్తున్న పింఛన్ల పంపిణీ పండుగలా జరగాలని, అర్హులందరికి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందజేయాలన్నా రు. పెంచిన పింఛన్‌లను టీడీపీ నాయకులతో ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయాలన్నారు. గత ప్రభుత్వానికి భిన్నంగా ప్రజలకు మెరుగైన సేవలంది మంచి పేరు తీసుకురావాల న్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో హరినారాయణ, తహశీల్దార్ ఈశ్వరమ్మ, పంచాయతీ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం పునఃప్రారంభం



వృద్ధాశ్రమంలో పూజలు చేస్తున్న కంచర్ల శ్రీనివాసులునాయుడు

మదనపల్లె, జూన్ 28: మదనపల్లె మండలం వలసపల్లె వద్ద నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం శనివారం పునఃప్రారంభమైంది. జైజవాన్ చారిటబుల్ ట్రస్టు, మాజీసైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు ఆశ్రమాన్ని పదేళ్లుగా నిర్వహిస్తున్నారు. అయితే వివిధ కారణాలతో రెండేళ్ల క్రితం మూతపడగా, ఆశ్రమాన్ని తిరిగి సంప్రదాయ బద్ధంగా పూజలు చేసి ప్రారంభించారు.

కలికిరి కేవీకేకు జోనల్ స్థాయిలో ఉత్తమ స్థానం



డాక్టర్ మీరా నుంచి అవార్డులు, ప్రశంసా పత్రాలు అందుకొంటున్న పాండురంగా

కలికిరి, జూన్ 28: కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం నాలుగు రాష్ట్రాల్లోని 72 కేవీకేలతో పోటీపడి ఉత్తమ స్థానం సాధించింది. గత మూడు రోజులుగా రాజమండ్రిలోని కేంద్రీయ పొగాకు పరిశోధనా స్థానంలో జరిగిన కేవీకేల వార్షిక జోనల్ సదస్సు సందర్భంగా కలికిరి కేవీకే 10వ స్థానం సాధించినట్లు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ఏపీ, తెలంగాణా, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 72 కేవీకేలు గతేడాది సాధించిన లక్ష్యాలపై సమీక్షలు జరిపిన అనంతరం క్షేత్ర పరిశీలన, శిక్షణ విస్తరణ కార్యక్రమాలను ఆధారం చేసుకుని బహుమతులు, ప్రశంసా పత్రాలు సాధించింది. క్షేత్ర పరిశీలన ద్వారా నూతన వేరుశనగ టీసీజీ ఎస్-1694 (విశిష్ట) రకం ద్వారా బెట్ట పరిస్థితుల్లో కూడా రైతులు అధిక దిగుబడులు పొందడం, మామిడి పంటను ఫ్రూట్ కవర్ల ఏర్పాటు ద్వారా రక్షించుకోవడానికి తగిన అవగాహ కల్పించడం తదితర అంశాలపై కలికిరి కేవీకే పదో స్థానం సాధించింది. సదస్సు చివరి రోజు జరిగిన సమావేశంలో పదవ ఆటారీ జోన్ (హైదరాబాదు) డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎస్ మీరా ద్వారా కేవీకే కోఆర్డినేటర్ పాండురంగా అవార్డులు అందుకున్నారు. అదే విధంగా కలికిరి కేవీకే శాస్త్రవేత్తలు వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొన్నందుకు ప్రశంసాపత్రాలను కూడా అందజేశారు.

వైసీపీ నుంచి మరో రెండు వికెట్లు ఔట్!



ఉపసర్పంచు పదవికి రాజీనామా చేస్తున్న నూరున్నీసా



వైసీపీకి రాజీనామా చేసిన అజయ్‌కుమార్

కలికిరి, జూన్ 28: వైసీపీ నుంచి ఎన్నికైన మరో ఇద్దరు ప్రజా ప్రతినిధులు రాజీనామాలు చేశారు. కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచు వి. నూరున్నీసా శుక్రవారం తన ఉప సర్పంచు పదవికి రాజీనామా చేశారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఆమె వైసీపీ మద్దతుతో 4వ వార్డు సభ్యురాలుగా ఎన్నికయ్యారు. అనంతరం ఉప సర్పంచుగా కూడా ఎన్నికయ్యారు. కాగా సర్పంచుగా ఉన్న ఆర్. ప్రతాప్‌కుమార్ రెడ్డి గత నెల 17న అనారోగ్యం కారణంగా మృతి చెందడంతో అప్పటి నుంచి సర్పంచు పదవి ఖాళీగా వుంది. ఈ నేపథ్యంలో ఉప సర్పంచు పదవికి నూరున్నీసా రాజీనామా చేయడంతో ఆ పదవి కూడా ఖాళీ అయింది. ఇదిలా వుండగా కలికిరి గ్రామ పంచాయతీకి సంబంధించిన మరో వార్డు సభ్యుడు వి.అజయ్‌కుమార్ వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. పార్టీ సభ్యత్వానికి, ఆ పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి పదవికి రాజీనామా చేస్తున్నట్లు తాడేపల్లెలోని వైసీపీ కేంద్ర కార్యాలయానికి రాజీనామా లేఖ పంపారు.

వాహనం సహా ఎర్ర దుంగలు స్వాధీనం

పీలేరు, జూన్ 28: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న ఒక వాహనంతో సహా 16 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ మదనపల్లె సబ్-డీఎఫ్‌వో శ్రీనివాసులు తెలిపారు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం ఉస్తికాయలపెంట సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారంతో పీలేరు ఎఫ్ఆర్‌వో రామ్లా నాయక్ నేతృత్వంలో తమ సిబ్బంది గురువారం రాత్రి ఆ ప్రాంతంలో వాహనాల తనిఖీ చేపట్టగా బొమ్మాజికుంట వద్ద వాహనం వదిలిపెట్టి అందులోని వారు పారిపోయారన్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా అందులో మామిడి కాయల కింద 658 కేజీలు బరువున్న 20 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. దీంతో ఆ వాహనంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.



దిల్ రుబా ఆఖరి కళాకారుడు శ్రీనివాసరావు మృతి

వెంకటగిరి టౌన్, జూన్ 28 : వెంకటగిరికి చెందిన అరుదైన దిల్‌రుబా వాయిద్య కళాకారుడు శ్రీనివాసరావు కన్నుమూశారు. ఆయన వయసు 104 సంవత్సరాలు. రాయదుర్గంలోని తన మేనల్లుడు డాక్టర్ గోపాల్ వద్ద కొంతకాలంగా ఉంటున్న శ్రీనివాసరావు గురువారం రాత్రి ఆఖరిశ్వాస విడిచారు. హిందుస్థానీ వాయిద్యం అయిన దిల్‌రుబా మీద కర్ణాటక సంగీతాన్ని పలికించడం శ్రీనివాసరావు ప్రత్యేకత. ఉత్తర భారతదేశంలోనే అరుదైన ఈ సంగీత వాయిద్యాన్ని దక్షిణభారతదేశంలో వాయించే ఆఖరి కళాకారుడు ఈయన. వయోలిన్, జలతరంగిణి, హార్మోనియం, కీ-బోర్డు ల్లోనూ శ్రీనివాసరావు దిట్ట. 1933 నుంచి వెంకటగిరిలోని అమెచ్యూర్ ఆర్టిస్ట్ అసోసియేషన్, వెంకటగిరి ఆర్ట్స్ థియేటర్, కల్చరల్ ఆర్ట్ థియేటర్స్, నట సమాఖ్య, ఆజాద్ అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ వంటి సంస్థల్లో ఆయన క్రియాశీలకంగా వ్యవహరించారు. 1940-50 మధ్య వెంకటగిరి క్లబ్ కార్యదర్శిగా పది సంవత్సరాలు సేవలందించారు. పంచాయతీ బోర్డు సభ్యుడిగానూ పనిచేశారు. ఎస్వీబీసీ మాజీ ఛైర్మన్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర సంగీత గేయధారకు హార్మోనియం సహకారం అందించారు.ఆచార్య ఆత్రేయతో మంచి సాన్నిహిత్యం ఉండేది. శ్రీనివాసరావు సంగీతమే ఊపిరిగా జీవించారు. పెళ్లి చేసుకోలేదు. కొన్నేళ్లుగా మేనల్లుడి వద్ద ఉంటూ గురువారం కన్నుమూశారు.

తిరుమల ఘాట్‌లో కలకలం





ఏనుగుల సంచారంతో శుక్రవారం సాయంత్రం తిరుమల మొదటి ఘాట్‌రోడ్డులో కలకలం రేగింది. ఏడవమైలు వద్ద 10ఏనుగులతో పాటు 3గున్న ఏనుగులు రోడ్డు సమీపానికి రావడం గమనించిన యాత్రికులు హడలిపోయారు.టీటీడీ ఫారెస్ట్ సిబ్బంది శబ్దాలు చేయడంతో 20 నిమిషాల తర్వాత ఏనుగులు అడవిలోకి వెళ్లిపోయాయి.మళ్లీ రాత్రి 8-9గంటల నడుమ మరోసారి ఏనుగుల గుంపు రోడ్డు సమీపానికి రాగా అడవిలోకి తరిమి వేసినట్లు అధికారులు తెలిపారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



రంగు చెత్తబుట్టలేం చేయాలబ్బా?



వారం కిందట పాలసముద్రం ఎంపీడీవో ఆఫీసులో దిగిన చెత్త బుట్టల లోడ్‌ను చూసిన అధికారులు అయోమయంలో పడ్డారు. స్వచ్ఛభారత్ కింద ఇంటింటికీ పంపిణీ చేసేందుకు 9000 చెత్తబుట్టల ఆర్డర్‌ను ఎన్నికలకు ముందు ఒక ఫ్యాక్టరీకి అప్పగించారు. వైసీపీ ప్రభుత్వంలో రంగు పిచ్చి ఎక్కువ కాబట్టి చెత్తబుట్టలను కూడా పచ్చ, నీలం రంగుల్లో తయారు చేయించారు. తీరా ఎన్నికలయ్యాక ఇవి దిగాయి. ఇప్పుడీ రంగు చెత్తబుట్టల్ని పంచడం ఎలాగబ్బా అని అధికారులు అయోమయంలో ఉన్నారు. పంచకపోతే నష్టం. పంచితే నాయకులు ఏమంటారో అనే భయం. చూడాలి ఏం చేస్తారో మరి!

- పాలసముద్రం

రొంపిచెర్లలో 8 మంది వార్డు మెంబర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందజేస్తున్న వార్డు సభ్యులు

రొంపిచెర్ల, జూన్ 28: పుంగనూరు నియోజకవర్గం రొంపిచెర్ల మండలానికి చెందిన 8 మంది వార్డు మెంబర్లు శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. ఈ మేరకు ఎంపీడీవో రెడ్డెప్ప ఆచారికి రాజీనామా పత్రాలు అందజేశారు. ఇప్పటికే పుంగనూరు మున్సిపల్ ఛైర్మన్, మరో పది మంది కౌన్సిలర్లు గురువారం వైసీపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. త్వరలోనే మరికొందరు కౌన్సిలర్లతో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో రొంపిచెర్ల పంచాయతీకి చెందిన 3, 6, 8 వార్డు మెంబర్లు ఎస్.మస్తాన్, సి.లక్ష్మయ్య, ఎన్.నజీముద్దీన్.. బోడిపాటివారిపల్లె పంచాయతీలో 2, 4, 6 వార్డు మెంబర్లు డి.సరేష్, ఎం.దీప, ఎస్.రెడ్డెమ్మ.. జగడంవారిపల్లె పంచాయతీ మూడో వార్డు మెంబరు ఎస్.బాలాజీ, పెద్దమల్లెల పంచాయతీ మూడవ వార్డు సభ్యుడు ఎస్.ప్రభు కుమార్ శుక్రవారం తమ పదవులకు రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేశామని తెలియజేశారు. ఈ రాజీనామాల వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

పలు ప్యాసింజర్ రైళ్ల రద్దు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: తిరుపతి- కాట్పాడి రైల్వేస్టేషన్ల మధ్య రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్లు జూలై 31వ తేదీవరకు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్ రాకేష్ తెలిపారు. తిరుపతి రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి తిరుపతి నుంచి కాట్పాడి వరకు రాకపోకలు నిర్వహించే ప్యాసింజర్ రైళ్ల(07659-07582)ను రద్దు చేశామన్నారు. అలాగే తిరుపతి- విల్లుపురం మధ్య నడిచే రైళ్లు (16853-16854)ను కూడా జూలై 31వ తేదీవరకు రద్దు చేశామని పేర్కొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు

చిత్తూరు లీగల్/గుడుపల్లె, జూన్ 28: బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి న్యాయస్థానం 20 ఏళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చింది. చిత్తూరు జిల్లా గుడుపల్లె మండలానికి చెందిన దేవరాజులు (32), అదే గ్రామానికి చెందిన తొమ్మిదో తరగతి చదువుకుంటున్న బాలికకు మాయమాటలు చెప్పాడు. గ్రామ సమీపాన గల వంక వద్ద అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని రిమాండుకు తరలించారు. ఈ కేసు శుక్రవారం పోక్సో కోర్టులో వాయిదా ఉండగా, పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం దేవరాజులుపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శాంతి తీర్పుచెప్పారు. అలాగే, బాలికకు నష్ట పరిహారం కింద రూ.3 లక్షలు ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించాలని కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 60,782 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,100 మంది తలనీలాలు సమర్పించారు.

చీటింగ్ కేసులో దంపతులకు మూడేళ్ల జైలు

తిరుపతి(లీగల్), జూన్ 28: చెక్ చీటింగ్ కేసులో తిరుపతికి చెందిన దంపతులు కె.శ్రీనివాసులు, కె.ఓంకారలక్ష్మిలకు మూడేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి మూడో అదనపు మున్సిఫ్‌కోర్టు న్యాయమూర్తి ఎం.సంధ్యారాణి శుక్రవారం తీర్పు చెప్పారు. ఫిర్యాదు తరపు న్యాయవాది జి.వెంకటకుమార్ తెలిపిన వివరాల మేరకు.. 2011 ఆగస్టు 14వ తేదీన తిరుపతి బైరాగిపట్టెడకు చెందిన పి.పురుషోత్తం వద్ద కె.శ్రీనివాసులు, ఓంకారలక్ష్మి దంపతులు రూ.4లక్షలు అప్పుగా తీసుకున్నారు. అప్పు చెల్లించే క్రమంలో భార్యపేరుతో ఉన్న చెక్‌పై భర్తసంతకం చేసి పురుషోత్తంకు ఇచ్చారు. సదరు చెక్‌ను బ్యాంకులో డిపాజిట్ చేయగా సంతకం తేడా రావడంతో రిటర్న్ అయింది. ఉద్దేశపూర్వకంగా మోసం చేసినట్లు నేరం నిరూపణ కావడంతో న్యాయమూర్తి పైవిధంగా శిక్ష విధించారు.

ఎస్వీయూలో నేడు ఏఐఎస్ఎఫ్ సమావేశాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 28: ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలు తిరుపతిలో శనివారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది. సభకు సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా, రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల ఈశ్వరయ్య హాజరు కానున్నారు.

పూర్తి అంగవైకల్యమున్నా పింఛను తీసేశారు

- పొలం ఉందంటూ తొలగింపు
- 34 ఏళ్లు వచ్చినా తల్లి లాలనలోనే
- వైద్యం ఖర్చులు అందించాలని ప్రభుత్వానికి గ్రామస్థుల వేడుకోలు

ఐరాల, జూన్ 28: శరీరంలో ఏ అవయమూ పనిచేయదు. 34 ఏళ్లు వచ్చినా చంటిబిడ్డలా చూసుకుంటోందా తల్లి. ఇతడి ఆలనా పాలనకు రోజూ ఇద్దరు మనుషులు కావాలి. ఇక, ఆస్పత్రిలో వైద్యం ఖర్చు ఏటా రూ.లక్షల్లోనే. అలాంటి ఇతడికి వైసీపీ ప్రభుత్వం నిర్దాక్షిణ్యంగా పింఛను తీసేసింది. ఇతడి తల్లిదండ్రుల పేరిట 18 ఎకరాల పొలం ఉందని తొలగించేసింది. పొలమున్నా సేద్యం చేయక.. డబ్బు రాక ఇబ్బంది పడుతున్నామని చెప్పినా పట్టించుకోలేదు. వివరాలిలా ఉన్నాయి. ఐరాల మండలం నాంపల్లె రెవెన్యూ మిరియంగంగనపల్లెకు చెందిన సోమశేఖర్‌నాయుడు, సరస్వతమ్మ దంపతులకు ఇద్దరు సంతానం. వారి కుమారుడు తులసీరామ్ పుట్టుకతోనే పూర్తి స్థాయి అంగ వైకల్యంతో జన్మించాడు. కొంత కాలానికి తండ్రి మృతి చెందాడు. అప్పట్నుంచి తల్లే అతడికి అన్నీ అయ్యి చూసుకుంటోంది. అతడి ఆలనా పాలనకు ఇద్దరు మనుషుల అవసరం ఉంటుంది. అతడికి ద్రవరూపంలో పైపు ద్వారా భోజనం అందిస్తారు. ఆ యువకుడిని అంగ వైకల్యంతో పాటు ఊపిరితిత్తుల సమస్య వెంటాడుతోంది. ఈ క్రమంలో అతడిని ఆస్పత్రిలో చూపించడానికి వెళ్లిన ప్రతి సారి రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు ఖర్చయేది. అలా ఏడాదిలో మూడు నుంచి నాలుగు సార్లు తీసుకెళ్లాల్సి వచ్చేది. ఇక, ప్రతి నెలా మందుల ఖర్చుగా రూ.15,000 వరకు ఖర్చవుతోంది. టీడీపీ హయాంలో ఈ యువకుడికి పూర్తి అంగవైకల్యం కింద పింఛను ఇచ్చేవారు. ఈ పింఛను డబ్బు మందుల ఖర్చుకు కొంతవరకు ఉపశమనంగా ఉండేది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. 2022 సెప్టెంబరులో నెలలో పింఛను తొలగించింది. ఇతడి తల్లిదండ్రుల పేరిట 18 ఎకరాల పొలం ఉండటాన్ని చూపారు. అయితే, కుటుంబ యజమాని లేకపోవడం, ఆ పొలాన్ని సొంతంగా సాగు చేయలేక ఆర్థికంగానూ ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో పింఛను కొనసాగిస్తే వైద్య ఖర్చులకు కొంతవరకు బాసటగా ఉంటుందని కోరినా అప్పటి వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. కాగా, కొంతకాలం కిందట అతడిని ఆస్పత్రికి తీసుకు రావాల్సిన అవసరం లేదని డాక్టర్లు చెప్పడంతో ఆ తల్లి తల్లడిల్లిపోయింది. అయినా, ఎంతో సహనంతో అతడిని చూసుకుంటోంది. ప్రస్తుతానికి ఊపిరితిత్తుల సమస్య కొంతవరకు తగ్గి ఆ యువకుడు కొంచెం కుదురుగా ఉన్నాడు. తులసీరామ్ పరిస్థితిని చూసి ఇప్పటి రాష్ట్ర ప్రభుత్వమైనా అతడి మందుల ఖర్చులకు అవసరమైన డబ్బును పింఛను రూపంలో అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ద్రవ రూపంలో ఫీడింగ్ తీసుకుంటున్న తులసీరామ్

భక్తులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

టీటీడీ ఈవో శ్యామలరావు

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని సరసమైన ధరలకు అందించడమే టీటీడీ లక్ష్యమని ఈవో శ్యామలరావు అన్నారు. తిరుమలలోని గోకుళం విశ్రాంతి భవనంలో శుక్రవారం సాయంత్రం జేఈవో వీరబ్రహ్మంతో కలిసి తిరుమలలోని పెద్ద, జనతా హోటళ్లపై సమీక్షించారు. సరసమైన ధరలకు నాణ్యమైన ఆహారాన్ని అందించడానికి ప్రముఖమైన హోటళ్లతో జాబితా రూపొందించడానికి ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్ అధ్యాపకుడు చలేశ్వరరావు, తాజ్ హోటల్స్ జీఎం చౌదరి సూచనలను ఆహ్వానించినట్టు తెలిపారు. దీనికిముందు తిరుమల ఎస్టేట్స్ స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తిరుమలలోని హోటళ్ల గురించి వివరించారు. అలాగే ఐటీ విభాగం భక్తులకు అందిస్తున్న వివిధ సేవల గురించి జియో బృందంతో ఈవో సమీక్షించారు. అనంతరం ఆలయ సిబ్బంది, పోటు కార్మికులతో సేంద్రియ ప్రసాదాలపై సమావేశం నిర్వహించారు. డిప్యూటీ ఈవోలు లోకనాథం, రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేకాధికారి శాస్త్రి, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, ఐజీ మేనేజర్ నాదముని, జియో సంస్థ ప్రతినిధులు మోహిన్ అబ్బాస్, విజయ్‌కుమార్, మంజీత్, పోటు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద భవనంలో తనిఖీలు

తిరుమలలోని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం తనిఖీలు చేశారు. భక్తులకు అందిస్తున్న అన్నప్రసాదాలను స్వయంగా పరిశీలించారు. భక్తులతో మాట్లాడారు. స్వయంగా కొన్ని అన్నప్రసాదాల రుచిని పరిశీలించారు. భక్తుల సూచన మేరకు అన్నప్రసాదాలను మరింత రుచిగా అందించాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు.



జేఈవోతో మాట్లాడుతున్న శ్యామలరావు

డీసీసీబీ, సీడీసీఎంఎస్‌లకు పీఐసీగా జేసీ బాధ్యతల స్వీకరణ

- 25 విండోలకు అధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 28: జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ), చిత్తూరు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ(సీడీసీఎంఎస్)లకు పర్సన్ ఇన్‌చార్జిగా జేసీ శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ రెండు సహకార సంఘాలకు పీఐసీగా ప్రభుత్వం జేసీని నియమించిన విషయం తెలిసిందే. కలెక్టరేట్‌లోని జేసీ చాంబర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డీసీవో నాగవర్ధన్, సీఈవో మనోహర్ గౌడ్, బిజినెస్ మేనేజర్ శ్రీధర్‌నాయుడు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఇదివరకు వీటికి సెవన్‌మెన్ నాన్ అఫీషియల్ కమిటీలు ఉండగా కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో కమిటీలు తమ పదవులకు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. జేసీ శ్రీనివాసులు ఈ పదవిలో ఆరు నెలల పాటు లేదా పాలకవర్గ ఎన్నికలయ్యేంత వరకు కొనసాగుతారు. కాగా, 25 విండోలకు సంబంధించి అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జులుగా డీసీవో నాగవర్ధన, సహకార శాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సీనియర్ ఇన్‌స్పెక్టర్లను నియమించగా వారు బాధ్యతలు స్వీకరించారు. వీరు ఈ ఏడాది డిసెంబరు 20వ తేదీ వరకు పదవిలో కొనసాగుతారు.

ముగిసిన చిరుధాన్యాల పరిశోధన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న తిలక్‌రాజ్ శర్మ

తిరుపతిరూరల్, జూన్ 28: ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం (ఆర్ఏఆర్ఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన రెండ్రోజుల అఖిల భారత చిరుధాన్యాల పరిశోధన సదస్సు శుక్రవారంతో ముగిసింది. దీనిలో భాగంగా చిరుధాన్య పంటల ఉత్పాదకత పెంపు, ఆహార, పోషక భద్రత సాధించే దిశగా గత ఏడాదిలో చిరుధాన్య పంటల్లో చేపట్టిన పరిశోధనా ఫలితాలని విశ్లేషించి.. ఈసంవత్సరం చేపట్టాల్సిన కార్యాచరణపై విపులంగా చర్చించారు. అలాగే చిరుధాన్య పంట రకాల ఎంపిక కోసం ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తిలక్‌రాజ్ శర్మ ఆధ్వర్యంలో వీఐసీ సమావేశం నిర్వహించారు. దేశవ్యాప్తంగా వివిధ వాతావరణ వ్యవసాయ మండలాల్లో చీడపీడలని తట్టుకుని అధిక దిగుబడితోపాటు అధిక పోషక విలువలు కలిగిన రకాలు, వంగడాలను సాగుకు సిఫారసు చేసినట్లు ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ తారా సత్యవతి వివరించారు. రూట్ అండ్ రైజోస్ఫేర్ ఇంజనీరింగ్ ఫర్ డెవలప్పింగ్ క్లైమేట్ రీసిలియెంట్ క్రాప్స్‌పై తిరుపతి ఐసర్ అధ్యాపకుడు డాక్టర్ ఈశ్వరరామిరెడ్డి ఉపన్యసించారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎన్జీరంగా వ్యవసాయవర్సిటీ వీసీ శారద జయలక్ష్మీదేవి, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ పీవీసత్యనారాయణ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ మధుసూదన్, ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి, ఎస్వీ వ్యవసాయ కళాశాల ఏడీ డాక్టర్ రమణ, ఐసీఎంఆర్ సిబ్బంది, వివిధ రాష్ట్రాలకు చెందిన పరిశోధకులు, ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ జాన్, డాక్టర్ కె.దేవకి, డాక్టర్ కదిరి మోహన్, తదితరులు పాల్గొన్నారు.



ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోండి

జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు

తిరుపతిరూరల్, జూన్ 28: పంటల సాగులో ఆధునిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని తిరుపతి జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాదరావు పిలుపునిచ్చారు. తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సెంటర్ ఫర్ అగ్రికల్చర్ అండ్ బయోసైన్స్ ఇంటర్నేషనల్(కాబి) ఆధ్వర్యంలో జిల్లాస్థాయి విస్తరణ అధికారులకు సాగులో డిజిటల్ యాప్‌లు, ఆన్‌లైన్ కోర్సులపై శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాబి యాప్స్ కోర్సులు చాలా ఉపయుక్తంగా ఉంటాయని, ఈ శిక్షణను అధికారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీరికి శిక్షణను దక్షిణ ఆసియా కోఆర్డినేటర్ మధు మంజరి ఇచ్చారు. వ్యవసాయశాఖ జిల్లా వనరులకేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య, డివిజన్ వ్యవసాయ అధికారులు, గ్రామస్థాయి వ్యవసాయ సహాయకులు, జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏవోలు శశికళ, వేణుగోపాల్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లలో టీటీఐల తనిఖీలు



రేణిగుంట రైల్వేకోర్టులో లైసెన్స్ లేని హాకర్లను హాజరు పరిచిన అధికారులు

తిరుపతి(సెంట్రల్), జూన్ 28: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ పరిధిలో శుక్రవారం పలు రైల్వేస్టేషన్లలో టీటీఐలు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రైల్వేకు అపరాధ రుసుం రూపంలో రూ.3.03 లక్షలు వసూలు చేసినట్లు డివిజన్ కమర్షియల్ మేనేజరు సోమశేఖర్ నాయుడు తెలిపారు. అలాగే ఎనిమిది మంది హాకర్లను రేణిగుంట రైల్వేకోర్టుకు హాజరు పరిచామన్నారు. రైల్వే స్టేషన్లలో మెడికల్ కార్డులు లేని అనధికార హాకర్లు వస్తు విక్రయాలు చేస్తూ ప్రయాణికులను మోసం చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రేణిగుంట- కడప- గూడూరు- కాట్పాడి మార్గాల్లో ఉన్న ప్రధాన రైల్వేస్టేషన్లలో తనిఖీలు నిర్వహించామన్నారు. 605 కేసులు నమోదు చేసినట్లు వివరించారు. ఏసీఎం ధనంజయకుమార్ సింగ్, చీఫ్ ఇన్స్‌పెక్టర్ ఎస్.వి.రావు, కె.సుధాకర్‌లతోపాటు 36 మంది స్క్వాడ్ టీటీఐలు పాల్గొన్నారు.